STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 340 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 8 నవంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

శ్మశానంలో బతుకుతున్న అమృతకు

బండి ఆపన్నహస్తం



బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

వివరాలు 3లో..

వాయుసేన ప్రపంచ రికార్డు!

- 13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా విమానం ల్యాండింగ్
- లద్దాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో చరిత్ర సృష్టించిన ఐఎల్-76ఎండీ
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఈ తరహా విమానం ల్యాండింగ్

4





ఈ20 పెట్రోల్‌పై మోదీ సమాధానం చెప్పాల్సిందే!

- నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ రాహుల్ గాంధీ ఆరోపణలు
- కొన్ని నమూనాల్లో 30 శాతం దాటిందన్న కాంగ్రెస్ అగ్రనేత

4

ధాన్యం నిల్వకు ఆధునిక సైలోలు



- తేమ పరీక్ష, శుభ్రపరచడం, ఆరబెట్టడం, నిల్వకు ఒకేచోట సదుపాయాలు
- పౌర సరఫరాల సంస్థ ద్వారా నేరుగా, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుకు రెండు నమూనాలు

2

- సచివాలయంలో ప్రతిపాదనలను సమీక్షించిన మంత్రి ఉత్తమ్

వరి ధాన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో ఆరబెట్టి నాణ్యతను కాపాడుతూ ఎక్కువ కాలం భద్రపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోల వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. పంట కోత తర్వాత నిల్వ నష్టాలను తగ్గించడం, మార్కెట్‌లో ధర అనుకూలించే వరకు రైతులు ధాన్యాన్ని భద్రపరచుకునే వీలు కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.



ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలి

సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్

కాలుష్యానికి తావులేకుండా సురక్షితంగా వేడుకలు జరుపుకోవాలని పిలుపు

2



ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే..

రైతులూ అప్రమత్తం!

వరి సాగుకు దూరంగా ఉండండి.. ఆరుతడి పంటలకే ప్రాధాన్యమివ్వండి

ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున రాష్ట్రంలో కూడా వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున, రైతులు వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా కేవలం ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మి రైతులు నష్టపోవద్దని కోరారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా ఈ పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వరుసగా పర్యటిస్తానని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు.

కొడంగల్, నవంబర్ 7 (సమయం న్యూస్): తెలంగాణలో రాబోయే రోజుల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశముందని, ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీరు తాగునీటి అవసరాలకే సరిపోతుందని స్పష్టం చేశారు. రైతులు ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎక్కువ నీరు అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి రైతులు నష్టపోవద్దని అన్నారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరూ సమష్టిగా పరిస్థితులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో సీఎం

మిగతా 2 లో



- ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు
- సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తా
- కాళేశ్వరం విధ్వంసానికి బీఆర్ఎస్ అవినీతే కారణం
- గడ్డం పెంచుకున్నంత మాత్రాన కేటీఆర్ తనలా మారలేడు
- కొడంగల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

దోచుకున్నది చాలక మళ్లీ అధికారం కోసం కలలు

- సీఎం కుర్చీ కోసం ప్రతిపక్ష నేత ప్రమాణస్వీకార రిహార్సల్స్
- ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు నింపుదాం
- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి

వివరాలు ం2లో..



డిండి నీటి సమస్యకు నదుల అనుసంధానమే పరిష్కారం

- ఏదుల నుంచి డిండికి నీళ్లు తేవడం అసాధ్యం
- బస్వాపూర్ మీదుగా గోదావరి జలాల తరలింపు
- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

3



సాగునీటి ప్రాజెక్టుల పేరుతో

కాంగ్రెస్ దోపిడీ

- కొడంగల్-నారాయణపేట-మక్తల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి
- మిగతా కంపెనీలన్నీ నామమాత్రమే
- 1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు పెరిగిన ప్రాజెక్టు వ్యయం
- చుక్క నీరు అందకముందే ఐదు రెట్లకు చేరిన అంచనా వ్యయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3





బోస్టన్‌లో తెలంగాణ యువతి అదృశ్యం

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన శ్రీజ రెడ్డి

2

- నవంబర్ 2న వాకింగ్‌కు వెళ్లి కనిపించకుండా పోయిన యువతి
- భారత కాన్సులేట్, తానా సహకారం కోరిన మంత్రి కోమటిరెడ్డి



4.5 లక్షల మందికి

కొత్తగా పింఛన్లు

- రాష్ట్రవ్యాప్తంగా కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయం
- నేడు కోడంగల్‌లో పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

2



ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలి

సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్

కాలుష్యానికి తావులేకుండా సురక్షితంగా వేడుకలు జరుపుకోవాలని పిలుపు

హైదరాబాద్, నవంబర్ 7 (సమయం న్యూస్): శోభాయమానమైన దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపాల కాంతులు ప్రతి ఇంటా నిండి ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని వేర్వేరు సందేశాల్లో నేతలు ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం తన పాలన ద్వారా ప్రజల జీవితాల్లోని కష్టాల చీకట్లను పారద్రోలి, బతుకుల్లో కొత్త వెలుగులు నింపే లక్ష్యంతో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. పండుగ సంబరాల వేళ పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కాలుష్య రహితంగా సురక్షిత వాతావరణంలో వేడుకలు చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. అజ్ఞానపు చీకట్లను తొలగించుకుని జ్ఞానకాంతులను ఆహ్వానించాలనే మహత్తర సందేశాన్ని దీపావళి పండుగ అందిస్తోందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల కష్టాలన్నీ తొలగిపోయి సకల ఐశ్వర్యాలు, సర్వ సంపదలు చేకూరేలా, రాష్ట్రం తిరిగి ప్రగతి పథంలో పయనించేలా లక్ష్మీదేవి అమ్మవారి దివ్య కరుణాకటాక్షాలు లభించాలని ప్రార్థించారు. బాణాసంచా కాల్చే సమయంలో చిన్న పెద్ద అందరూ తగిన రక్షణ జాగ్రత్తలు వహిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా పండుగ జరుపుకోవాలని కేసీఆర్ సూచించారు.

బోస్టన్‌లో తెలంగాణ యువతి అదృశ్యం

నల్గొండ, నవంబర్ 7: అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న తెలంగాణకు చెందిన 23 ఏళ్ల యువతి అదృశ్యం కావడం కలకలం రేపింది. నల్గొండ జిల్లా కనగల్ మండలం శబ్దుల్లపురానికి చెందిన శ్రీజ రెడ్డి బోస్టన్‌లో కనిపించకుండా పోయింది. ఏడాదిన్నర క్రితం ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఆమె అక్కడ చదువుకుంటూనే పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తోంది. ఇటీవల స్వగ్రామానికి వచ్చి నెల రోజుల పాటు కుటుంబ సభ్యులతో గడిపి తిరిగి అమెరికా వెళ్లింది. నవంబర్ 2న సాయంత్రం కాలేజీ నుంచి గదికి చేరుకున్న శ్రీజ వాకింగ్ కోసం బయటకు వెళ్లింది. సుమారు కిలోమీటరు నడిచిన తర్వాత ఆమె ఆచూకీ తెలియకుండా పోయింది. అప్పటి నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. నవంబర్ 3న పోలీసులకు ఫిర్యాదు అందగా, నవంబర్ 4న బోస్టన్ పోలీస్ శాఖ మిస్సింగ్ అలర్ట్ జారీ చేసింది. శ్రీజ ఆచూకీ గుర్తించేందుకు ప్రజల సహకారం కోరింది. కార్సన్ బీచ్, హార్బర్ పాయింట్ ప్రాంతాల్లో ఆమె ఉండే అవకాశాలపై పోలీసులు గాలిస్తున్నారు. చివరిసారిగా నల్లని జాకెట్, నీలిరంగు జీన్స్ ధరించినట్లు వివరాలు వెల్లడించారు. శ్రీజను సురక్షితంగా తీసుకొచ్చేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బోస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్, కేంద్ర విదేశాంగ శాఖ అధికారులతో పాటు స్థానిక పోలీసులను సంప్రదించారు. గాలింపు చర్యల్లో సహకరించాలని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ప్రతినిధులను కోరారు. మరోవైపు కుమార్తె ఆచూకీ తెలియక ఆమె తండ్రి కోయ యాదగిరిరెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీజ క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు.

4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు

రాష్ట్రవ్యాప్తంగా కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయం

నేడు కోడంగల్‌లో పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్, నవంబర్ 7: తెలంగాణలోని నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పండుగ కానుక అందించనుంది. ప్రజా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మరో 4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. నవంబర్ 8న వికారాబాద్ జిల్లా కోడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్వయంగా పాల్గొని, లబ్ధిదారులకు నూతన పింఛన్ల మంజూరు పత్రాలను అందజేయనున్నారు. సామాజిక భద్రతకు ప్రాధాన్యమిస్తూ కొత్త లబ్ధిదారుల ఎంపిక చేపట్టినట్లు మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత, గీత కార్మికులతో పాటు ఇతర అర్హులకు ఈ పింఛన్లు అందనున్నాయి. కోడంగల్‌లో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ పంపిణీ చేపట్టనున్నారు. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారు. కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు నవంబర్ నెల నుంచే పింఛన్ సొమ్మును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా పింఛన్లు అందిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. కొత్త పింఛన్ల మంజూరుతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది.

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే.. రైతులూ అప్రమత్తం!

మొదటి పేజీ తరువాయి

పాల్గొన్నారు. రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమై హకీంపేటలో నిర్మిస్తున్న విద్యా కేంద్రం పనులను పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో సాగునీటి పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ అంశాలపై మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటుందని, అయితే తెలంగాణలో మాత్రమే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. రాబోయే వేసవిలో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టుల్లోని నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని వివరించారు. ఈ నేపథ్యంలో రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపాలని సూచించారు. రైతులు నష్టపోకుండా ముందుగానే అప్రమత్తం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు నీరు వెళ్తోందన్న బీఆర్ఎస్ ఆరోపణలను సీఎం ఖండించారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి పంపుహౌస్ నుంచి ఎత్తిపోతలు చేపట్టే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను దించే పరిస్థితి కూడా లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, నిర్మాణ లోపాల కారణంగానే కాళేశ్వరం పరిధిలోని మూడు బ్యారేజీలు పూర్తిస్థాయిలో పనిచేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల వంటి ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. పాలమూరు ప్రాంతం నుంచి గెలిచిన కేసీఆర్ భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ అక్కడి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే దెబ్బతిన్నదని ఆరోపించారు. వచ్చే డిసెంబరులో ప్రత్యేక శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని తెలిపారు. ఆ సమావేశాల్లో ఎల్‌నినో ప్రభావం, కాళేశ్వరం ప్రాజెక్టు అంశాలపై సమగ్ర చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాల పెంపుపై కేటీఆర్ చేస్తున్న విమర్శలను సీఎం తిప్పికొట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రాంత అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షల పరిహారం ఇచ్చేందుకు కూడా అప్పటి ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం అందిస్తోందని వెల్లడించారు. హైదరాబాద్--లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రముఖ పరిశ్రమలు ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. హకీంపేటలో 250 ఎకరాల్లో విద్యా కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.

గడ్డం పెంచితే రేవంత్ కాలేరు!

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వేషభాషలు మార్చుకున్నంత మాత్రాన ప్రజల విశ్వాసాన్ని పొందలేరని అన్నారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ ఎద్దేవా చేశారు. తాను మూడేళ్లుగా గంట కూడా సెలవు తీసుకోకుండా ప్రజల కోసం పనిచేస్తున్నానని పేర్కొన్నారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే తమ తీర్పును వెల్లడించారని అన్నారు. అసత్య ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించడంతోపాటు ప్రజల సమస్యలను తెలుసుకుంటానని తెలిపారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురైతే ప్రజలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని చెప్పారు. రైతులు కూడా పరిస్థితులను అర్థం చేసుకుని నీటిని పొదుపుగా వినియోగించాలని, సాగులో జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.



ధాన్యం నిల్వకు ఆధునిక సైలోలు

- తేమ పరీక్ష, శుభ్రపరచడం, ఆరబెట్టడం, నిల్వకు ఒకేచోట సదుపాయాలు
- పౌర సరఫరాల సంస్థ ద్వారా నేరుగా, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుకు రెండు నమూనాలు
- సచివాలయంలో ప్రతిపాదనలను సమీక్షించిన మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, నవంబర్ 7 : వరి ధాన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో ఆరబెట్టి నాణ్యతను కాపాడుతూ ఎక్కువ కాలం భద్రపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోల వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. సచివాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైలోల నిర్మాణం, నిర్వహణ, నిధుల సమీకరణపై సమీక్షించారు. పంట కోత తర్వాత నిల్వ నష్టాలను తగ్గించడం, మార్కెట్‌లో ధర అనుకూలించే వరకు రైతులు ధాన్యాన్ని భద్రపరచుకునే వీలు కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ధాన్యాన్ని పెద్ద మొత్తంలో నేరుగా నిల్వ చేయగల భారీ ఉక్కు గిద్దంగులే సైలోలు. ప్రతిపాదిత సైలో కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసేందుకు తూకం వంతెనలు, తేమ, నాణ్యతను పరీక్షించేందుకు ప్రయోగశాల ఏర్పాటు చేయనున్నారు. కేంద్రానికి వచ్చిన ధాన్యంలో మట్టి, చెత్త వంటి మలినాలను యంత్రాల సాయంతో తొలగిస్తారు. తేమ ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని డ్రయర్లతో ఆరబెట్టి, సురక్షిత నిల్వకు అనువైన స్థాయికి తేమను తగ్గిస్తారు. ఆరబెట్టిన ధాన్యాన్ని యాంత్రిక పరికరాల సాయంతో నేరుగా ఉక్కు సైలోల్లోకి తరలించి నిల్వ చేస్తారు. ఈ పద్ధతిలో గోనె సంచుల వినియోగం తగ్గుతుంది. నిల్వ సమయంలో ధాన్యం నాణ్యతను పరీక్షించేందుకు, పురుగుల బెడదను నియంత్రించేందుకు అవసరమైన ఏర్పాట్లనూ ప్రతిపాదించారు. మొదటి నమూనాలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ గుర్తింపు పొందిన ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సమీకరించి నేరుగా సైలోలను ఏర్పాటు చేయనుంది. రెండో నమూనాలో తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తించనున్న సుమారు 20 ప్రదేశాల్లో ప్రైవేటు పారిశ్రామికవేత్తలు సైలోలను ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తారు. పెట్టుబడులు ఆర్థికంగా ఆచరణ సాధ్యమయ్యేందుకు పౌర సరఫరాల సంస్థ నిర్దిష్ట కాలానికి అద్దె చెల్లింపుల హామీ ఇచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. సైలోల నిర్మాణ, నిర్వహణ వ్యయాలు, నిధుల సమీకరణ, అద్దె చెల్లింపు బాధ్యతలను అంచనా వేయాలని మంత్రి అధికారులను కోరారు. తక్కువ వడ్డీకి ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అనువైన ప్రదేశాలను గుర్తించి, ఆర్థిక, సాంకేతిక నిపుణులతో సంప్రదించి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేయాలన్నారు. పంట కోసిన సమయంలో ధాన్యంలో సాధారణంగా సుమారు 25 శాతం తేమ ఉంటుందని మంత్రి వివరించారు. ఆరబెట్టే, భద్రంగా నిల్వ చేసే సదుపాయాలు లేక చాలామంది రైతులు అప్పటి మార్కెట్ ధరకే, కొన్నిసార్లు కోత ముగిసిన 24 గంటల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. సైలో కేంద్రాల్లో శాస్త్రీయంగా ఆరబెట్టి నిల్వ చేసే వీలు కలిగితే రైతులు ధర అనుకూలించినప్పుడు ధాన్యాన్ని అమ్ముకోగలుగుతారని చెప్పారు. ప్రీమియం వరి రకాల ధాన్యంలో తేమ సుమారు 25 శాతం ఉన్నప్పుడు క్వింటాలుకు రూ.3,500 నుంచి రూ.4,500 వరకు ధర పలుకుతోందని మంత్రి పేర్కొన్నారు. అదే ధాన్యాన్ని శాస్త్రీయంగా ఆరబెట్టి తేమను సుమారు 12 శాతానికి తగ్గిస్తే క్వింటాలుకు రూ.5,000 నుంచి రూ.5,500 వరకు ధర పలికే అవకాశం ఉందని వివరించారు. జేఎస్ఆర్, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ వంటి తెలంగాణ వరి రకాలకు దేశీయ, విదేశీ మార్కెట్లలో ఆదరణ పెరుగుతోందని, కొన్ని మార్కెట్లలో జేఎస్ఆర్ బియ్యం బాస్మతి కంటే అధిక ధర పలుకుతోందని మంత్రి పేర్కొన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరికి మెరుగైన నిల్వ సదుపాయాలు కల్పించడం వ్యవసాయరంగ వృద్ధికి, రాష్ట్ర జీడీపీ పెరుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. మడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న తెలంగాణ లక్ష్యానికీ ఇది తోడ్పడుతుందన్నారు. సమీక్షలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర, అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దోచుకున్నది చాలక మళ్లీ అధికారం కోసం కలలు

- సీఎం కుర్చీ కోసం ప్రతిపక్ష నేత ప్రమాణస్వీకార రిహార్సల్స్
- ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు నింపుదాం
- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి



హైదరాబాద్, నవంబర్ 7 (సమయం న్యూస్): గతంలో ఇందిరమ్మ ప్రభుత్వాలు పేదలకు ఇళ్లు, స్థలాలు మంజూరు చేస్తే నాటి బీఆర్ఎస్ పాలకులు వాటిని నిర్దాక్షిణ్యంగా కొల్లగొట్టారని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ధరణి పేరిట భూదోపిడీ, కాళేశ్వరం పేరిట భారీ అవినీతికి పాల్పడి రాష్ట్రానికి రూ.8.25 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మిగిల్చారని ధ్వజమెత్తారు. ఆ అప్పుల కారణంగా నెలకు రూ.6,500 కోట్లను ప్రజాప్రభుత్వం వడ్డీ రూపేణా చెల్లిస్తోందని వివరించారు. రంగారెడ్డి జిల్లా నందిగామలో ఎంపీడీవో కార్యాలయ ప్రారంభం, ఎమ్మార్వో కార్యాలయ భవన శంకుస్థాపనతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి కట్టుపడుతుంటే, మరోవైపు రానున్న కాలంలో తానే సీఎం అవుతానన్న భ్రమతో ఓ ప్రముఖుడు ఇప్పటినుంచే ప్రమాణస్వీకారోత్సవానికి రిహార్సల్స్ వేస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రెండేసి జిల్లాలను పంచుకుని దోపిడీకి పాల్పడిన నేతలు ఇప్పుడు నాలుగేసి జిల్లాలు కావాలంటూ ఒత్తిడి తెస్తున్నారని, వారి కలలు కల్లలు కాక తప్పవని అన్నారు. ముందు నీ నియోజకవర్గంలో గెలిచి, ఆ తర్వాత సీఎం పీఠం గురించి ఆలోచించాలని హితవు పలికారు. ప్రజా ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేయకపోతే తల వేయి ముక్కలవుతుందన్న భయంతో ప్రతిపక్ష నేతలు అసత్యాలు చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వపు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను కొనసాగించడమే ప్రజా ప్రభుత్వ భేషజాలు లేని పాలనకు నిదర్శనమన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు రూ.73 వేల కోట్లను సున్నా వడ్డీకి డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని, ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు మంజూరు చేసిన 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో 2,25,100 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రానున్న కాలంలో మరిన్ని ఇళ్లు ఇస్తామన్నారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లలో ఆనందోత్సాహాలు జరుపుకునేందుకు శనివారం నుంచి 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరిట వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సచివాలయంలో హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలోనూ ఈ పండుగ రూపకల్పనను ఆయన స్పష్టం చేశారు.

'భూభారతి' సంస్కరణలు.. నందిగామకు వరాలు

ధరణి లోపాలను సరిదిద్ది భూసమస్యలు లేకుండా చేసేందుకు 'భూభారతి' పేరిట సంస్కరణలు తెస్తున్నామని, ఏడాదిన్నరలో 10,456 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి ప్రతి భూమికి పట్టా, మ్యాప్‌లతో పాటు ఆధార్ నంబర్ తరహాలో ప్రత్యేక 'భూధార్' నంబర్ ఇస్తామని వెల్లడించారు. ఈనెల 19న సిద్దిపేట వేదికగా చిలక పచ్చరంగు బతుకమ్మ చీరలను మహిళలకు అందజేస్తామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే శంకరన్న అభ్యర్థన మేరకు నందిగామకు ఆర్డీవో కార్యాలయ భవనం, ఎమ్మార్వో కార్యాలయ భవనం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సిద్ధాపురంలో డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలిస్తామని, వెంగిరాల, వెంజెళ్ల ప్రాంతాల్లోని భూసమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కేంద్రంగా హైదరాబాద్

- 'ఆర్థా ఫిన్‌టెక్' కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, నవంబర్ 7 : ఫిన్‌టెక్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌లో పరిశోధన, అభివృద్ధి(ఆర్ అండ్ డీ)కి ప్రోత్సాహం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న ఆర్థా ఫిన్‌టెక్ హైదరాబాద్ కార్యాలయాన్ని హైటెక్ సిటీలో ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఐటీ/ఐటీఈఎస్ రంగంలో హైదరాబాద్ సాధించిన అంతర్జాతీయ గుర్తింపును ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలకూ విస్తరించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా పెట్టుబడులకు, ఆవిష్కరణలకు, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌కు దేశంలోనే అత్యుత్తమ గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. గ్లోబల్ కంపెనీలు తమ కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించేలా ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ ఎకో సిస్టం"ను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. బ్యాంకింగ్-యాజ్-ఏ-సర్వీస్, ఓపెన్ బ్యాంకింగ్ ఏపీఐలు, ఆటోమేటెడ్ ఆన్‌బోర్డింగ్, కేవైసీ/కేవైబీ, ఏఎంఎల్, అంతర్జాతీయ చెల్లింపులు, డిజిటల్ వాలెట్ మౌలిక సదుపాయాలు తదితర ఫైనాన్షియల్ టెక్నాలజీ పరిష్కారాలను ఆర్థా ఫిన్‌టెక్ అందిస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. కార్యక్రమంలో కంపెనీ సీఈవో మధుబాబు గడిపాటి, ఆర్మిన్ ఒర్డోడరీ, ఇమాన్యుయేల్ సి. ఫెర్నాండెస్ తదితరులు పాల్గొన్నారు.

ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలి

- అటవీ సంపదతోపాటు ఆదివాసీల జీవనోపాధికి ప్రాధాన్యం
- అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ సీఎస్‌తో మంత్రి సీతక్క సమీక్ష



ములుగు, నవంబర్ 7 : ములుగు జిల్లాలో విస్తారంగా ఉన్న అటవీ, ప్రకృతి సంపదను పరిరక్షిస్తూనే పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి స్థానిక ఆదివాసీ గిరిజనులకు జీవనోపాధి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. అటవీ సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ములుగులో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ములుగు జిల్లాకు వచ్చిన జయేష్ రంజన్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి సీతక్కతో శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అటవీ ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ, ఎకో టూరిజం అభివృద్ధి, ఏజెన్సీ ప్రాంతాల మౌలిక వసతులు, ఆదివాసీ గిరిజనుల జీవనోపాధి తదితర అంశాలపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. జిల్లాకు ఉన్న ప్రత్యేక భౌగోళిక, ప్రకృతి వనరుల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలని మంత్రి సూచించారు. జిల్లాలోని దట్టమైన అడవులు, కొండలు, వాగులు, జలపాతాలు, సహజసిద్ధమైన ప్రకృతి ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉన్నాయని, అయితే పర్యాటక అభివృద్ధి పేరుతో అటవీ సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడాలని సూచించారు. ప్రకృతిని కాపాడుతూ పర్యాటకులను ఆకర్షించే విధంగా ఎకో టూరిజం కేంద్రాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్థానిక ప్రజలను, ముఖ్యంగా ఆదివాసీ గిరిజనులను ఈ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములను చేయడం ద్వారా వారికి స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించవచ్చన్నారు. స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తులు, హస్తకళలు, సంప్రదాయ కళలు, ఆహార ఉత్పత్తులు తదితరాలను పర్యాటక రంగంతో అనుసంధానం చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ములుగు ప్రకృతి సంపదను పరిరక్షించడంతో పాటు స్థానిక ప్రజల ఆదాయాన్ని పెంచే విధంగా అభివృద్ధి కొనసాగాలని అన్నారు. అటవీ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఇతర అత్యవసర మౌలిక వసతుల కోసం చేపట్టే అభివృద్ధి పనులకు కేంద్ర అటవీ, పర్యావరణ అనుమతుల ప్రక్రియలో అనవసర జాప్యం లేకుండా చూడాలని కోరారు. ఏజెన్సీ గ్రామాల ప్రజలకు మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని జయేష్ రంజన్‌ను మంత్రి కోరారు. జిల్లా ప్రకృతి సంపదను భవిష్యత్ తరాలకు కాపాడుతూ అదే సమయంలో అక్కడి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ దిశగా అటవీ, పర్యావరణ శాఖతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓతోపాటు అటవీ, పర్యావరణ, జిల్లా పరిపాలనకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డిఫెన్స్ మద్యం అక్రమ విక్రయాలపై
ఎక్సైజ్ దాడులు

ఆల్వాల్ పరిధిలో రెండు చోట్ల తనిఖీలు

లోతుకుంటలో 96, బోయిన్‌పల్లిలో 67 బాటిళ్లు స్వాధీనం



హైదరాబాద్, నవంబర్ 7: డిఫెన్స్ క్యాంటీన్ల ద్వారా మాజీ సైనికులకు తక్కువ ధరకు లభించే మద్యం అక్రమ విక్రయాలకు తెరలేపిన కొందరిపై ఎక్సైజ్ శాఖ చర్యలు చేపట్టింది. క్యాంటీన్ల నుంచి మద్యం తీసుకొచ్చి ఇళ్లలో నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఆల్వాల్ ప్రాంతంలో రెండు చోట్ల దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 163 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్‌రావు నేతృత్వంలోని బృందం సరస్వతీనగర్, లోతుకుంటలో మన్యం నాగప్రసన్న, రామాంజనేయులు దంపతుల ఇంట్లో సోదాలు చేసింది. ఈ సందర్భంగా 96 డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. మాజీ సైనికుడైన రామాంజనేయులు తనతో పాటు ఇతరుల మద్యం కోటా ద్వారా క్యాంటీన్ల నుంచి బాటిళ్లు తీసుకొస్తుండగా, భార్య నాగప్రసన్న వాటిని స్థానికులకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో ఆమెను అరెస్టు చేసి ఆల్వాల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. మరోవైపు న్యూ బోయిన్‌పల్లి సౌజన్య కాలనీలో ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ గణపతిరెడ్డి బృందం తనిఖీలు నిర్వహించింది. ముసిమి లెంక (39) ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 67 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. ఆమెను అదుపులోకి తీసుకుని ఆల్వాల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించింది. రెండు దాడుల్లో పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ. 2.11 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. డిఫెన్స్ క్యాంటీన్ల ద్వారా లభించే మద్యం వెసులుబాటును దుర్వినియోగం చేస్తూ అక్రమ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

తెలంగాణ ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1,625 పీజీ సీట్లు

కొత్తగా 359 సీట్లకు జాతీయ వైద్య కమిషన్ ఆమోదం

హైదరాబాద్, నవంబర్ 7: తెలంగాణలో వైద్య విద్య, ప్రభుత్వ వైద్య సేవల విస్తరణకు మరో ముందడుగు పడింది. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అదనంగా 359 పీజీ సీట్లను కేటాయించేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఆమోదం తెలిపింది. దీంతో ఇప్పటివరకు 1,266గా ఉన్న పీజీ సీట్ల సంఖ్య 1,625కు చేరింది. గతంలో రాష్ట్రంలోని 10 ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే పీజీ కోర్సులు అందుబాటులో ఉండగా, తాజా అనుమతులతో ఆ సంఖ్య 23కు పెరిగింది. మొత్తం 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 23 చోట్ల పీజీ విద్య అందుబాటులోకి రానుంది. నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, వనపర్తి, మంచిర్యాల, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, ఖమ్మం, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, నిర్మల్, సంగారెడ్డి, నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలల్లో తొలిసారిగా పీజీ సీట్లు మంజూరయ్యాయి. కాలేజీల్లో అధ్యాపకుల నియామకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త భవనాల నిర్మాణం, అనుబంధ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాల కల్పనతో అదనపు సీట్లకు మార్గం సుగమమైంది. జాతీయ వైద్య కమిషన్ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వసతులు మెరుగుపడటంతో ఈ అనుమతులు లభించాయి. పీజీ సీట్ల పెంపుతో జిల్లా కేంద్రాల్లోనే వివిధ వైద్య విభాగాల నిపుణులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల సంఖ్య పెరిగితే స్థానిక ప్రజలకు మెరుగైన చికిత్స అందుతుంది. ఎంబీబీఎస్ పూర్తిచేసిన రాష్ట్ర విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే ఉన్నత వైద్య విద్యను అభ్యసించేందుకు అవకాశాలు విస్తరిస్తాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని 1,625 పీజీ సీట్లతో పాటు నిమ్స్‌లో అదనంగా 107, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో 106 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ సుమారు 2,600 పీజీ సీట్లు ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి.

శ్మశానంలో బతుకుతున్న అమృతకు బండి సంజయ్ ఆపన్నహస్తం!

బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

తక్షణమే ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరిన బండి



సిరిసిల్ల, నవంబర్ 7 (సమయం న్యూస్): సొంత ఇల్లు లేక శ్మశానమే నివాసంగా మార్చుకుని అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడితో కలిసి దుర్భర జీవితాన్ని గడుపుతున్న చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన మర్రిపల్లి అమృతకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బాసటగా నిలిచారు. అమృతకు తక్షణ సాయంగా రూ.50 వేలు పంపారు. ఈ నగదు మొత్తాన్ని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ద్వారా బాధితురాలకు అందజేశారు. దీంతోపాటు జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ తో కేంద్ర మంత్రి ఫోన్లో మాట్లాడుతూ అమృత దుస్థితిని వివరించారు. అమృతకు తక్షణమే డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. మరోవైపు అనారోగ్యం బారిన పడిన కొడుకుతో కలిసి శ్మశానంలో నివసిస్తూ పుట్టెడు దుఃఖంలో ఉన్న అమృతకు అన్ని విధాలా అండగా ఉండాలని బండి సంజయ్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరైన వెంటనే ఆ ఇంటికి అవసరమైన సామాగ్రితోపాటు కుటుంబానికి సరిపడా నిత్యావసర సరుకులను

సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ దోపిడీ

కొడంగల్-నారాయణపేట-మక్తల్ టెండర్లలో పాంగులేటి కంపెనీకి లబ్ధి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ



హైదరాబాద్, నవంబర్ 7 : కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీకి ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యవహారంపై ఆయన సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. తలకిందులుగా పడినా తమదే గెలుపు అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారం ఉందని వ్యాఖ్యానించారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం టెండర్లు పిలిస్తే మంత్రి పొంగులేటికి చెందిన సొంత కంపెనీ కూడా టెండర్లలో పాల్గొన్నదని ఆరోపించారు. మిగతా కంపెనీలన్నీ కాగితాలపైనే ఉన్న నామమాత్రపు సంస్థలని, చివరకు ఒక్క కంపెనీ మాత్రమే పోటీలో మిగిలి విజయం సాధించేలా వ్యవహారం నడిచిందని విమర్శించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం భారీగా పెరిగిపోవడంపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.6,825 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. అంటే దాదాపు ఐదు రెట్లు వ్యయం పెరిగిందని, ప్రజాధనాన్ని ఈ స్థాయిలో ఖర్చు చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ప్రాజెక్టు ద్వారా ఒక్క చుక్క నీరు కూడా అందలేదని విమర్శించారు. అంచనా వ్యయాన్ని భారీగా పెంచుతూ టెండర్ల ప్రక్రియను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. టెండర్లలో పారదర్శకతకు తావులేకుండా తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు దక్కేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని మండిపడ్డారు. ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంటే మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచి కాంట్రాక్టుల ద్వారా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించి ఇలాంటి దోపిడీకి సరిపోయే కొత్త పదాన్ని సూచించాలని కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. జరుగుతున్న ఈ దోపిడీని వివరించడానికి క్రోనీ క్యాపిటలిజం, బహిరంగ దోపిడీ, క్లెప్టోక్రసీ వంటి పదాలు కూడా సరిపోవడం లేదని వ్యాఖ్యానించారు.

డిండి నీటి సమస్యకు నదుల అనుసంధానమే పరిష్కారం

ఏదుల నుంచి డిండికి నీళ్లు తేవడం అసాధ్యం

బస్వాపూర్ మీదుగా గోదావరి జలాల తరలింపు

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



నల్గొండ, నవంబర్ 7: డిండి రిజర్వాయర్‌కు ఏదుల నుంచి నీటిని తరలిస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రెండు జిల్లాల ప్రజలను మోసం చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఏదులకే రెండు టీఎంసీల నీటిని తీసుకురాలేని పరిస్థితుల్లో డిండికి ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. శనివారం డిండి రిజర్వాయర్ వద్ద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తన ప్రతిపాదనలను వివరించారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంతోనే డిండి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కాళేశ్వరం అదనపు టీఎంసీ ద్వారా బస్వాపూర్ మీదుగా డిండికి నీటిని అందించవచ్చని తెలిపారు. బస్వాపూర్ పనులు 80 శాతం పూర్తయ్యాయని, వాటిని వేగంగా ముగించాలని సూచించారు. ఏదుల నుంచి నీటిని తరలించే ప్రతిపాదనకు అవసరమైన సర్వేలు, సాంకేతిక ఆధారాలు ఏమిటో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిసార్లు సర్వేలు చేసినా డిండికి నీటి వనరును గుర్తించలేకపోయిందని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు శ్రీశైలాన్ని సోర్స్‌గా ఎంచుకోవడం కూడా తప్పిదమేనని అంగీకరిస్తూ, గత ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నందుకు క్షమాపణలు కోరారు. ఏటా గోదావరి నుంచి 3,500 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తున్నా వినియోగించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కొత్త ప్రతిపాదనలు చేపట్టడం సరికాదన్నారు. నల్గొండలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి దీర్ఘకాలం నదీ జలాలు అందించాలని, జిల్లాలో చిన్న రిజర్వాయర్లు నిర్మిస్తామని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పరిష్కారాలు సూచిస్తున్న తమ పార్టీ అభ్యర్థులకు పట్టభద్రులు మద్దతు ఇవ్వాలని కవిత కోరారు.

పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ

సొంత ఆదాయాన్ని నేరుగా ఖాతాల్లో జమ చేసుకునే వెసులుబాటు

హైదరాబాద్, నవంబర్ 7: గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీలు వివిధ మార్గాల ద్వారా సమకూర్చుకునే సొంత ఆదాయాన్ని ఇకపై నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు తెలంగాణ పంచాయతీరాజ్ (నాలుగో సవరణ) చట్టం-2026ను తీసుకొచ్చింది. అక్టోబర్ 9, 2026 నుంచి ఈ సవరణ అమల్లోకి వస్తుందని పేర్కొంటూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో ఎంఎస్ నెం.43ను జారీ చేసింది. గతంలో గ్రామ పంచాయతీలు సొంతంగా సమకూర్చుకున్న ఆదాయాన్ని తొలుత ప్రభుత్వ ఖజానాలో జమ చేయాల్సి వచ్చేది. ఆ తర్వాత అవసరమైన నిధులను తిరిగి పొందేందుకు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండటంతో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురయ్యేవి. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రహదారుల మరమ్మతులకు నిధులు అందడంలో జాప్యం జరిగేది. ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం చట్ట సవరణ చేపట్టింది. కొత్త నిబంధనలతో పంచాయతీల సొంత ఆదాయం నేరుగా వాటి బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. దీంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగించుకునే అవకాశం కలగనుంది.

సంపాదకీయం



రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడనుందా?

త్వరలోనే భారీ శాంతి ఒప్పందం కుదరవచ్చన్న ట్రంప్

చర్చలకు ఇరు దేశాలు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడి

యూరప్ భద్రత, నాటో పాత్రపైనా కీలక నిర్ణయాలకు అవకాశం

ప్రమాదకర ప్రతిపాదనలపై అప్రమత్తంగా ఉండాలన్న జెలెన్‌స్కీ


ఏళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇరు దేశాలు యుద్ధాన్ని ముగించేందుకు ఒక ఒప్పందానికి రావడానికి ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. త్వరలోనే భారీ శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం కేవలం రష్యా, ఉక్రెయిన్‌లకే పరిమితం కాకుండా యూరప్ దేశాల భద్రతకు సంబంధించిన అంశాలను కూడా కలిగి ఉండవచ్చని తెలిపారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రత్యేక ప్రతినిధి కిరిల్ దిమిత్రివ్‌తో వైట్‌హౌస్‌లో సమావేశమైన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా, ఉక్రెయిన్ దేశాలు యుద్ధానికి ముగింపు పలికేందుకు ఒకే వేదికపైకి రావడానికి సిద్ధంగా ఉన్నట్లు తనకు అనిపిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య శాంతి నెలకొల్పే దిశగా పెద్ద ఒప్పందం కుదరవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందం యూరప్ మొత్తానికి సంబంధించిన అంశాలను కూడా కలిగి ఉండే అవకాశం ఉందన్నారు. అయితే చర్చల ప్రతిపాదనలు, ఒప్పందం అమలుకు సంబంధించిన వివరాలు ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది. శాంతి ఒప్పందంలో యూరప్ భద్రత, నాటో పాత్ర, భవిష్యత్తులో మరోసారి యుద్ధం తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య నెలకొన్న వివాదానికి శాశ్వత పరిష్కారం లభించాలంటే భద్రతాపరమైన హామీలు కీలకమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో యూరప్ దేశాల భాగస్వామ్యం కూడా చర్చల్లో ప్రధాన అంశంగా మారవచ్చని ట్రంప్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. మరోవైపు అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ అప్రమత్తంగా స్పందించారు. రష్యా, యూరప్ మధ్య భద్రతా ఒప్పందం కుదుర్చుకోవడం అంత సులభమైన విషయం కాదని పేర్కొన్నారు. కొన్ని ప్రతిపాదనలు భవిష్యత్తులో ప్రమాదకర పరిణామాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. యుద్ధాన్ని ముగించే ఒప్పందం కుదరాలంటే ముందుగా ఇరు దేశాల మధ్య ఉన్న ప్రధాన సమస్యలకు పరిష్కారం లభించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై ట్రంప్ వ్యక్తం చేసిన ఆశాభావం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే శాంతి ఒప్పందం కుదిరేందుకు ఇరు దేశాల అంగీకారంతోపాటు భద్రతా హామీలు, వివాదాస్పద అంశాలపై స్పష్టత అవసరం. ట్రంప్ వ్యాఖ్యలతో శాంతి ప్రయత్నాలపై ఆశలు పెరిగినప్పటికీ, అధికారిక ఒప్పందం కుదిరే వరకు యుద్ధం ముగింపుపై అనిశ్చితి కొనసాగనుంది.

ఈ20 పెట్రోల్‌పై మోదీ సమాధానం చెప్పాల్సిందే!

- నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ రాహుల్ గాంధీ ఆరోపణలు
- కర్ణాటకలో పరీక్షించిన 14 నమూనాల్లో 11 చోట్ల అధిక మోతాదు గుర్తించినట్లు వెల్లడి
- కొన్ని నమూనాల్లో 30 శాతం దాటిందన్న కాంగ్రెస్ అగ్రనేత
- మైలేజీ తగ్గి వాహనదారులపై అదనపు భారం పడుతోందని విమర్శ
- ఇంధనంలో ఇథనాల్ శాతం ఎందుకు వెల్లడించడం లేదని నిలదీత



న్యూఢిల్లీ, నవంబర్ 7 (సమయం న్యూస్): దేశవ్యాప్తంగా వినియోగిస్తున్న ఈ20 పెట్రోల్‌లో నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మాత్రమే ఉంటుందని కేంద్రం చెబుతుండగా, వాస్తవంగా అంతకంటే ఎక్కువ మోతాదులో కలుపుతున్నట్లు కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో వెల్లడైందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వాహనదారుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఇంధన సరఫరా జరుగుతోందని ఆరోపిస్తూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కర్ణాటక ప్రభుత్వం ఏడు జిల్లాల్లోని పెట్రోల్ బంకుల నుంచి సేకరించిన 14 నమూనాలను గుర్తింపు పొందిన ప్రయోగశాలలో పరీక్షించగా, వాటిలో 11 నమూనాల్లో 20 శాతానికి మించి ఇథనాల్ ఉన్నట్లు తేలిందని రాహుల్ గాంధీ వెల్లడించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందిన ఒక నమూనాలో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం నమూనాలో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలతోపాటు ప్రైవేటు సంస్థల నమూనాల్లోనూ నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ ఉన్నట్లు ఆరోపించారు. పెట్రోల్‌లో ఇథనాల్ మోతాదు పెరగడం వల్ల వాహనాల మైలేజీ తగ్గడంతోపాటు కొన్ని వాహనాల్లో నిర్వహణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధిక ధరలకు పెట్రోల్ కొనుగోలు చేస్తున్న ప్రజలు మైలేజీ తగ్గితే మరింత ఆర్థిక భారం భరించాల్సి వస్తుందని విమర్శించారు. ముఖ్యంగా పాత వాహనాలు, అధిక ఇథనాల్ మిశ్రమాలకు అనుగుణంగా రూపొందించని ఇంజిన్లపై ప్రభావం ఎలా ఉంటుందో ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధనంలో వాస్తవంగా ఎంత శాతం ఇథనాల్ ఉందో వినియోగదారులకు తెలియజేసే పారదర్శక వ్యవస్థ లేకపోవడాన్ని రాహుల్ తప్పుబట్టారు. ప్రజలు కొనుగోలు చేస్తున్న ఇంధన నాణ్యత, మిశ్రమం గురించి తెలుసుకునే హక్కు వారికి ఉందని పేర్కొన్నారు. చమురు సంస్థల సొంత ప్రయోగశాలల పరీక్షలకు, కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల ఫలితాలకు మధ్య వ్యత్యాసం ఎందుకు వచ్చిందో వివరించాలని డిమాండ్ చేశారు. ఈ20 పేరుతో విక్రయిస్తున్న పెట్రోల్‌లో వాస్తవంగా ఎంత శాతం ఇథనాల్ కలుపుతున్నారు? నిర్దేశిత పరిమితిని మించినట్లు తేలితే సంబంధిత చమురు సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? వాహనదారులకు జరుగుతున్న నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఇథనాల్ మిశ్రమ వివరాలను బహిరంగంగా ఎందుకు ప్రకటించడం లేదు? అంటూ రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు. ఇథనాల్ మిశ్రమ విధానం వల్ల నిజంగా ఎవరికి ప్రయోజనం కలుగుతోందో కేంద్రం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వం నిర్వహించినట్లు పేర్కొన్న పరీక్షల ఫలితాలపై స్వతంత్ర పరిశీలన జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. ఈ20 పెట్రోల్‌పై రాహుల్ చేసిన ఆరోపణలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. అయితే నమూనాల పరీక్షల వివరాలు, ఇథనాల్ మోతాదుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, చమురు సంస్థల అధికారిక వివరణతోనే పూర్తి స్పష్టత రానుంది.



దేశ ప్రజలకు ప్రధాని మోదీ దీపావళి శుభాకాంక్షలు!

న్యూఢిల్లీ, నవంబర్ 7 (సమయం న్యూస్): పవిత్రమైన దీపావళి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి జీవితాలు నిత్యం సుఖసంతోషాలతో, సకల విజయాలతో కాంతివంతంగా వెలిగిపోవాలని ఆయన ఆకాంక్షించారు. చెడుపై మంచి, చీకటిపై వెలుగు సాధించిన మహోన్నత విజయానికి దీపావళి పండుగ దివ్య ప్రతీక అని చెప్పారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా శనివారం ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. 'ఈ పవిత్రమైన దీపావళి పర్వదినం మీ జీవితాల్లో నిరంతరం ప్రశాంతతను, ఉన్నత విజయాలను, అలరారే సుఖసంతోషాలను అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు. కాగా, గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రధాని మోదీ తన దీపావళి పండుగను సరిహద్దుల్లో దేశాన్ని రక్షిస్తున్న వీర సైనికులతో కలిసి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా అదే ఆనవాయితీని, సంప్రదాయాన్ని కొనసాగిస్తూ సైనికుల మధ్యనే దీపావళి సంబరాలను జరుపుకోనున్నట్లు ఆయన తన వీడియో సందేశంలో స్పష్టంగా వెల్లడించారు.

క్రమశిక్షణే సైనికుడిని యోధుడిగా మారుస్తుంది

రాజ్‌నాథ్ సింగ్!



కొల్‌కతా, నవంబర్ 7 (సమయం న్యూస్): కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాయుసేన సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బాగ్‌డోగ్రా ఎయిర్‌ఫీల్డ్‌లో నిర్వహించిన వేడుకల్లో సైనికులకు ఆయన మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. భారత వైమానిక దళ సిబ్బంది ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రశంసించారు. మన సాయుధ దళాలు సరిహద్దుల్లో రేయింబవళ్లు కాపలాగా ఉండటం వల్లే, దేశ ప్రజలు ప్రతి పండగను ఆనందంగా, స్వేచ్ఛగా జరుపుకొంటున్నారని తెలిపారు. వారు చూపే ధైర్యం, నిస్వార్థ సేవకు యావత్ దేశం ఎంతో గర్వపడుతోందన్నారు. 'ఆపరేషన్ సిందూర్'తో మన వాయుసేన శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు. 'సైనికులలో ధైర్యం, క్రమశిక్షణ లేకపోతే అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా అది నిష్ప్రయోజనమే. మన సాయుధ దళాలు క్రమశిక్షణకు మారుపేరు. అదే ఒక సాధారణ సైనికుడిని అసాధారణ యోధుడిగా మారుస్తుంది. అదే సమయంలో డ్రోన్లు, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలతో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలతో సాయుధ దళాలను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది. మీ అందరి సహకారంతో భారత్ మరింత ముందుకు వెళ్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశంలో పెరుగుతోన్న రక్షణ ఉత్పాదక సామర్థ్యాలను రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి వల్లే దేశీయ స్టార్టప్‌లు, పరిశ్రమలు.. డ్రోన్‌లు, డ్రోన్ నిరోధక వ్యవస్థలు, సైనికుల కోసం అధునాతన పరికరాలను అభివృద్ధి చేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో అన్ని రకాల ఆయుధాలు, క్షిపణులను సొంతంగా తయారు చేసుకునే స్థాయికి భారత్ ఎదగాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ధైర్యముంటే నాపైకి బుల్డోజర్లు పంపండి

బీజేపీకి మమత సవాల్

కొల్‌కతా, నవంబర్ 7 (సమయం న్యూస్): తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఇంటిపై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. తమకు ఎదురు తిరిగిన వారిపైకి బుల్డోజర్లు పంపడం భాజపాకు అలవాటని దుయ్యబట్టారు. వారి దగ్గర ఎన్ని బుల్డోజర్లు ఉంటే అన్నీ తనపైకి పంపాలని సవాల్ చేశారు. 'మీ దగ్గర ఎన్ని బుల్డోజర్లు ఉన్నాయి? రండి, నేను మీ ముందే నిల్చొని ఉన్నాను. నాపై బుల్డోజర్లను నడపండి. మీరెంత ధైర్యవంతులో చూడాలనుకుంటున్నాను' అని భాజపాపై విమర్శలు గుప్పించారు. అభిషేక్‌ను ఆయన నివాసంలో పరామర్శించిన అనంతరం మమత ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ.. తృణమూల్ నేతలపై దాడులు చేయడమే కాకుండా కాళీఘాట్ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా జరుగుతోన్న కాళీ పూజలకు అంతరాయం కలిగిస్తోందని మమత ఆరోపించారు. పలు ప్రాంతాల్లో పూజలు నిర్వహించడానికి అనుమతులు రద్దు చేశారని.. కొన్ని చోట్ల ప్రధాన రహదారులపై పూజ చేసుకునేందుకు అనుమతిచ్చారని అన్నారు. ఈ మార్పులు ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం తెల్లవారుజామున కాళీఘాట్‌లో ఉన్న తన నివాసంపై భాజపా కార్యకర్తలు రాళ్లు, ఇటుకలతో దాడి చేసినట్లు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మమత ఆయన్ని పరామర్శించారు.



భారత వాయుసేన ప్రపంచ రికార్డు!

- 13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా విమానం ల్యాండింగ్
- లద్దాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో చరిత్ర సృష్టించిన ఐఎల్-76ఎండీ
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఈ తరహా విమానం ల్యాండింగ్
- అత్యంత క్లిష్టమైన వాతావరణంలోనూ సత్తాచాటిన భారత వైమానిక దళం
- చైనా సరిహద్దు సమీపంలో మరింత బలోపేతమైన వ్యూహాత్మక సామర్థ్యం



న్యూఢిల్లీ, నవంబర్ 7 (సమయం న్యూస్): భారత వైమానిక దళం మరో అరుదైన ఘనత సాధించింది. సముద్ర మట్టానికి 13,629 అడుగుల ఎత్తులో భారీ రవాణా విమానాన్ని విజయవంతంగా దింపి సరికొత్త చరిత్ర సృష్టించింది. తూర్పు లద్దాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో భారత వైమానిక దళానికి చెందిన ఐఎల్-76ఎండీ భారీ రవాణా విమానం సురక్షితంగా దిగింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఈ తరహా విమానం ల్యాండింగ్ కావడం ఇదే తొలిసారని భారత వైమానిక దళం వెల్లడించింది. ఈ అద్భుత ఘట్టానికి సంబంధించిన చిత్రాలు, దృశ్యాలను సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకుంది. అత్యంత క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల్లో సాధించిన ఈ విజయం భారత వైమానిక దళ సాంకేతిక సామర్థ్యానికి, సిబ్బంది నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిందని పేర్కొంది. సాధారణంగా సముద్ర మట్టానికి అత్యంత ఎత్తులో ఉన్న ప్రాంతాల్లో విమానాల రాకపోకలు సవాళ్లతో కూడుకుని ఉంటాయి. అక్కడ గాలి సాంద్రత తక్కువగా ఉండటంతో విమాన ఇంజిన్ల పనితీరు, విమానాన్ని నియంత్రించే సామర్థ్యం ప్రభావితమవుతాయి. ముఖ్యంగా భారీ రవాణా విమానాలను దించడం, తిరిగి గాల్లోకి తీసుకెళ్లడం మరింత క్లిష్టమైన ప్రక్రియ. ఇలాంటి పరిస్థితుల్లో 13,629 అడుగుల ఎత్తులో ఉన్న న్యోమా వైమానిక స్థావరంలో ఐఎల్-76ఎండీ విమానాన్ని విజయవంతంగా దించడం విశేషంగా నిలిచింది. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పైలట్లు, సాంకేతిక సిబ్బంది ప్రదర్శించిన కచ్చితత్వం, సమన్వయం, వృత్తి నైపుణ్యాన్ని భారత వైమానిక దళం ప్రశంసించింది. తూర్పు లద్దాఖ్‌లోని న్యోమా ప్రాంతం భారత్-చైనా వాస్తవ నియంత్రణ రేఖకు సమీపంలో ఉండటంతో వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. సరిహద్దు ప్రాంతాల్లో సైనికుల తరలింపు, రక్షణ సామగ్రి రవాణా, అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలకు వైమానిక రవాణా కీలకంగా మారుతుంది. న్యోమా వంటి ఎత్తైన ప్రాంతాల్లో భారీ రవాణా విమానాలను నడపగల సామర్థ్యం పెరగడం ద్వారా సరిహద్దు ప్రాంతాలకు అవసరమైన సామగ్రిని మరింత సమర్థవంతంగా తరలించే అవకాశం ఉంటుంది. తాజా ల్యాండింగ్ భారత రక్షణ వ్యవస్థలో కీలక మైలురాయిగా నిలిచిందని వైమానిక దళం అభివర్ణించింది. ఐఎల్-76ఎండీ రష్యాలో రూపొందించిన నాలుగు ఇంజిన్ల భారీ రవాణా విమానం. సైనికులు, ఆయుధ సామగ్రి, వాహనాలు, ఇతర అవసరమైన సరకులను సుదూర ప్రాంతాలకు తరలించేందుకు దీనిని వినియోగిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో భారీ స్థాయిలో సామగ్రిని తరలించగల సామర్థ్యం ఈ విమానం ప్రత్యేకత. మారుమూల ప్రాంతాల్లో సైనిక కార్యకలాపాలకు మద్దతు అందించడంలోనూ ఈ విమానాలు కీలక పాత్ర పోషిస్తాయి. న్యోమా వైమానిక స్థావరంలో భారీ రవాణా విమానం విజయవంతంగా దిగడం భారత వైమానిక దళానికి గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘనత ద్వారా అత్యంత ఎత్తైన ప్రాంతాల్లోనూ సంక్లిష్టమైన వైమానిక కార్యకలాపాలు నిర్వహించగల సామర్థ్యాన్ని చాటుకున్నట్లు తెలిపారు. సిబ్బంది నైపుణ్యం, విమాన సామర్థ్యం, సమర్థవంతమైన ప్రణాళిక సమన్వయంతోనే ఈ విజయం సాధ్యమైందని వివరించారు.

చీకటిపై వెలుగు విజయానికి ప్రతీక దీపావళి

- **వరంగల్ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు 'గంట రవికుమార్'**

శివనగర్, నవంబర్ 7 (సమయం న్యూస్) :

వరంగల్ జిల్లాలోని హిందూ బంధువులందరికీ, ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పేర్కొన్నారు. దీపావళి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు సమృద్ధిగా కలగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో అత్యంత విశిష్టమైన పర్వదినంగా జరుపుకుంటారని తెలిపారు. దీపాల వెలుగులతో ప్రతి ఇల్లు ప్రకాశించడమే కాకుండా, ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆశలు, ఆనందాలు, సానుకూలత నిండాలని ఆకాంక్షించారు. దీపావళి పండుగ సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర ప్రేమానురాగాలను మరింత పెంపొందించాలని పేర్కొన్నారు. లక్ష్మీదేవి అనుగ్రహంతో వరంగల్ జిల్లాలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఆర్థికాభివృద్ధి, శాంతి, సౌభాగ్యాలు కలగాలని కోరుకున్నారు.



ప్రజల జీవితాల్లో ఎదురయ్యే కష్టాలు తొలగిపోయి, ప్రతి ఒక్కరూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నారు.సనాతన ధర్మ సంప్రదాయాలను గౌరవిస్తూ, భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచే దీపావళి పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని గంట రవికుమార్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పండుగ వేళ దీపాలు వెలిగించడంతో పాటు, ఇతరుల జీవితాల్లోనూ సంతోషాల వెలుగులు నింపేలా ప్రతి ఒక్కరూ ప్రేమ, ఆప్యాయత, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు.అలాగే, దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, పిల్లలు, వృద్ధుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పండుగను సురక్షితంగా జరుపుకోవాలని కోరారు. ఈ దీపావళి వరంగల్ జిల్లా ప్రజలందరికీ కొత్త ఆశలు, సంతోషాలు, శుభపరిణామాలను తీసుకురావాలని మరోసారి ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

అఖిలభారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభ

- **లను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రం ఆవిష్కరణ.**

రామన్నపేట నవంబర్ 07 (సమయం న్యూస్)



యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నముల గ్రామం ఈ నెల 15 నుండి 18 వరకు నల్లగొండ పట్టణ కేంద్రంలో జరిగే అఖిలభారత రైతు సంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బోయిని ఆనంద్ మాజీ ఎంపిపి నాగటి ఉపేందర్ రైతులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రామన్నపేట మండలం నీర్నేముల గ్రామంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు అనంతరం వారు మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్న నేడు అనేక సమస్యలతో సతమతమవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్ శక్తులకు వ్యవసాయ భూములను అప్పగించే విధానాలను అనుసరిస్తున్నాయని విమర్శించారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, పెట్టుబడి ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నా అందుకు అనుగుణంగా పంటలకు ధరలు లభించడం లేదని అన్నారు.రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర కల్పించాలని, పంటల కొనుగోలుకు సమగ్ర వ్యవస్థ ఏర్పాటు చేయాలని, నకిలీ విత్తనాలు,ఎరువుల కొరతను అరికట్టాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు.తొంగ సమస్యల పరిష్కారం కోసం అఖిలభారత రైతు సంఘం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని, అ పోరాటాల రూపకల్పనకై ఈనెల 15 నుండి 18 వరకు నల్లగొండ పట్టణ కేంద్రంలో జరిగే 36వ జాతీయ మహాసభలు కీలక వేదికగా నిలవనున్నాయని తెలిపారు. నవంబర్ 15వ తేదీన నల్లగొండ పట్టణ కేంద్రంలో రైతు గర్జన బహిరంగ సభ ఉంటుందని అన్నారు కావున రైతులు, కూలీలు, వ్యవసాయ కార్మికులు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో సభలో పాల్గొని బహిరంగ సభను జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల బండ జగన్ మోహన్ రెడ్డి, ఆవుల సత్తయ్య నేమనంది లింగయ్య, పాల్వాయి చంద్రశేఖర్ రెడ్డి, బల్లెం సత్తయ్య,సుర్వి ఎల్లయ్య, బోయిని రామచంద్రం, సత్తయ్య పాల్గొన్నారు.

వలిగొండ నివాసంలో ప్రజలు, నాయకులను కలిసిన ఎమ్మెల్యే

- **కుంభం అనిల్ కుమార్ రెడ్డి.**
- **సమస్యల పరిష్కారానికి అధికారులకు తక్షణ ఆదేశాలు.**

వలిగొండ నవంబర్ 07 (సమయం న్యూస్)



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి వలిగొండలోని తన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ప్రజలు తమ గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు, ఇతర ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు అందజేశారు. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే ఓపికగా విని, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై వెంటనే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి, ఆయా సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం తన బాధ్యతని, నియోజకవర్గ ప్రజలు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బాలరాజు యాదవ్ మృతిపై అనుమానాలు..

- **ఉచ్చు కథనంతో కేసును ముగించొద్దు.. దోషులెవరైనా కఠినంగా శిక్షించాలి**
- **బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం**
- **సమగ్ర విచారణ జరపాలి...బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ డిమాండ్**

నర్సంపేట, నవంబర్ 7 (సమయం న్యూస్) :

ఖానాపురం మండలం మనుబోతులగడ్డ గ్రామానికి చెందిన మంచే బాలరాజు యాదవ్ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బీసీ కులాల ఐక్యవేదిక, బీసీ పవర్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేశాయి. ఘటనకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు, అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ కోరారు.బాలరాజు యాదవ్ మృతిని అడవి జంతువులకు ఏర్పాటు చేసిన ఉచ్చులో చిక్కుకుని జరిగిన ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. అసలు ఉచ్చులను ఎవరు గుర్తించారు? ఘటనాస్థలంలో ఆధారాలను పూర్తిస్థాయిలో సేకరించారా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. వ్యవసాయ పనులపై అవగాహన ఉన్న బాలరాజు ఉచ్చులో చిక్కుకుని మరణించాడనే కథనంపై పలు సందేహాలు ఉన్నాయని తెలిపారు.డబ్బు ఆశ చూపి పథకం ప్రకారం ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చనే అనుమానాలతో పాటు, హత్య చేసి విద్యుత్ షాక్‌కు గురిచేసి కాల్వలో పడేశారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ అంశాలన్నింటినీ పోలీసులు శాస్త్రీయంగా విచారించి నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు.కేసు పూర్తిస్థాయి విచారణ జరగకముందే ఒక నిర్ణయానికి



వచ్చి, ఏకపక్ష కథనాలతో కేసును ముగించే ప్రయత్నం చేయకూడదని ఆబోతు రాజు యాదవ్ స్పష్టం చేశారు. నేరస్తులు ఎంతటి పలుకుబడి కలిగిన వారైనా చట్టం ముందు సమానమేనని, దోషులుగా తేలిన వారిని కఠినంగా శిక్షించాలని, జిల్లాస్థాయి పోలీసు ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.పోలీసులు నేరస్తులతో స్నేహపూర్వకంగా ఉండాల్సిన అవసరం లేదని, సమాజానికి ఉపయోగపడే ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూ నేరాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కేసును ఉచ్చు కథనంతో ముగించే ప్రయత్నం జరిగితే ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయపోరాటం కొనసాగిస్తామని, బాలరాజు యాదవ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని ఆబోతు రాజు యాదవ్ స్పష్టం చేశారు.

అనురాగపు వెలుగుల్లో అనాథ చిన్నారుల దీపావళి

- **పదిమందికి ఆనందాన్ని పంచడమే నిజమైన పండుగ... డాక్టర్ అనితా రెడ్డి**
- **దీపావళి వెలుగుల్లో దివ్యాంగ చిన్నారుల ఆనందోత్సాహం**
- **అనాథ చిన్నారులతో అనురాగ దీపావళి.. ఆనందాల పండుగ**

హనుమకొండ, నవంబర్ 7 (సమయం న్యూస్)



పండుగ అంటే మనం మాత్రమే ఆనందంగా ఉండటం కాదని, పదిమందికి సంతోషాన్ని పంచడమే నిజమైన పండుగ అని కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. దివ్యాంగులు, అనాథ చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు నింపినప్పుడే పండుగకు నిజమైన అర్థం చేకూరుతుందని పేర్కొన్నారు.అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమం, స్వధార్ ఆశ్రమం, అనాథ పిల్లల ఆశ్రమాల్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి చిన్నారులకు కాకరపుల్లలు, చిచ్చుబుడ్లు, బూచక్రాలు తదితర టపాసులు అందజేశారు. వారితో కలిసి టపాసులు కాల్చి దీపావళి సంబరాలను ప్రారంభించారు. చిన్నారులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేసి మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఇంట్లో పండుగ జరుపుకుంటే మనం మాత్రమే ఆనందంగా ఉంటామని, ఇతరులతో ఆనందాన్ని పంచుకున్నప్పుడే పండుగకు పరిపూర్ణత లభిస్తుందని అన్నారు. కల్మషం ఎరుగని చిన్నారులతో దీపావళి సంబరాలు నిర్వహించడం ఎంతో ఆనందాన్నిచ్చిందని పేర్కొన్నారు. టపాసులు చూసిన వెంటనే చిన్నారుల ముఖాల్లో కనిపించిన ఆనందం మనసుకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.అజ్ఞాన తిమిరాన్ని తొలగిస్తూ కాంతిపుంజాన్ని ప్రసరింపజేసే దీపావళి పండుగ మనలోని అహంకారాన్ని, అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగిస్తుందని అన్నారు. ఈ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, లక్ష్మీదేవి ప్రతి ఇంట సిరిసంపదలు కురిపించి అందరినీ కరుణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, సుచరిత, వసుధ, హరిత, శైలజ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు ఎంపికైన వడ్డేపల్లి వెంకటేష్

రామన్నపేట నవంబర్ 07 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు 2026 సంవత్సరమునకు గాను దళిరత్న యువజన సంఘం అధ్యక్షుడు, యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడ గ్రామ వాస్తవ్యులు వడ్డేపల్లి వెంకటేష్ ఎంపికైనట్లు జాతీయ అవార్డు కమిటివారు ప్రకటించారు. అవార్డు సెలెక్షన్ కమిటి నేషనల్ చైర్మన్, బిఎస్ఏ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్లోని బహుజన సాహిత్య అకాడమి జాతీయ కార్యాలయములో అందజేశారు.ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మట్లాడుతూ ఎస్.సి.ఎస్.టి., బి.సి. మరియు మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి ఏట ప్రజా ఉద్యమకారులకు, సంఘసేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలియజేశారు. ఈ సంవత్సరం నవంబర్ 15వ తేదిన దేశరాజధాని న్యూ ఢిల్లీలో నిర్వహించే బహుజన సాహిత్య అకాడమీ 20వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగ ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలియజేశారు. దేశంలోని 28 రాష్ట్రాల నుండి సుమారుగా 1000 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్సికి హాజరవుతారని తెలియజేశారు. ఈ అవార్డ్ లెటర్ అందజేసిన వారిలో తెలంగాణ రాష్ట్ర కమిటి సభ్యులు టేకి రాజశేఖర్, కనుకుంట్ల విజయ్ కుమార్ అవార్డు సెలక్షన్ కమిటి సభ్యులు బి.భాస్కర్ ఉన్నారు.



జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- **టీజేఏ జిల్లా అధ్యక్షుడు షానూర్ బాబా.**

భువనగిరి నవంబర్ 07 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇంటి స్థలాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు మొహమ్మద్ షానూర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం బీబీనగర్ పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత ఇళ్లు లేక అనేకమంది జర్నలిస్టులు అద్దె ఇళ్లలో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తెస్తూ సమాజానికి సేవ చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ గృహ పథకంలో ప్రాధాన్యత కల్పించి, వారి సొంత ఇంటి కలను సాకారం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టీజేఏ బీబీనగర్ మండల అధ్యక్షుడు రెడ్డబోయిన మహేష్, కార్యదర్శి మంచాల అనిల్, సభ్యులు ఇందిరాల శివాజీ, పాముకుంట్ల ఉషా కిరణ్, బింగి చంద్ర శేఖర్ పాల్గొన్నారు.



పాలేరు నియోజకవర్గంలో మూడు మండలాల్లో

- **'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి'**
- **పొంగు లేటి పర్యటన**

ఖమ్మం, నవంబర్ 7 : (సమయం న్యూస్)

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగ వెలుగులు నింపేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రేపు (ఆదివారం) పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాల్లో భాగంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలిసి బాణాసంచా కాల్చి దీపావళి వేడుకలను జరుపుకోనున్నారు.పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం 8:30 గంటలకు ఖమ్మం రూరల్ మండలం కామంచికల్‌లో, 9:30 గంటలకు నేలకొండపల్లి మండలం కోరట్లగూడెంలో, 10:30 గంటలకు కూసుమంచి మండలం పాలేరులో జరిగే కార్యక్రమాలకు మంత్రి హాజరవుతారు. మూడు మండలాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మమేకమై వారి ఇళ్లలో దీపావళి సంబరాలను పంచుకోనున్నారు.

వీబీ-గ్రామ్‌జీ పనుల నిర్వహణపై మేట్‌లకు శిక్షణ

- **కూలీల హాజరు నమోదు, పనుల కొలతల విషయంలో నిబంధనలు పాటించాలి: ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్**

ఆలేరు, నవంబర్ 07(సమయం న్యూస్):

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం వి బిజీ రామ్ జి పథకంలో భాగంగా గ్రామాల్లో పనిచేసే మేట్‌లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో ఉపాధి హామీ పనుల నిర్వహణ, కూలీల హాజరు నమోదు, పనుల కొలతలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించి, వారి ద్వారా పనుల నిర్వహణను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. మేట్‌లు కూలీల హాజరును ఎన్ ఎం ఎం ఎస్ యాప్ ద్వారా రోజుకు రెండుసార్లు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. అలాగే నిర్దీత నిబంధనలు, పనుల కొలతల ప్రకారం కూలీలతో పనులు చేయించాలని స్పష్టం చేశారు. పనుల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ, కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని మేట్‌లకు సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌పీ బాలు, ఏపీవో అరుణకుమారి, ఇన్‌చార్జి ఇంజినీరింగ్ కన్సల్టెంట్ వై రామచంద్రయ్య చారి, టెక్నికల్ అసిస్టెంట్ మానస పాల్గొన్నారు.



ప్రత్యేక విద్యార్థుల సృజనకు 'సీపీ' చేయూత

- **ప్రత్యేక విద్యార్థుల ప్రతిభకు అండగా వరంగల్ పోలీస్ కమిషనర్ 'ఎన్. శ్వేత'**
- **చేతితో తయారు చేసిన వస్తువులు కొనుగోలు చేసి ప్రోత్సాహం**
- **చిన్నారులకు స్వీట్లు పంపిణీ.. దీపావళి శుభాకాంక్షలు తెలిపిన సీపీ**

హనుమకొండ, నవంబర్ 7 (సమయం న్యూస్)



ప్రత్యేక విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ వారి సృజనాత్మకతకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత చేయూతనందించారు. హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన ప్రత్యేక విద్యార్థులు స్వయంగా తయారు చేసిన హ్యాండ్‌మేడ్ వస్తువులను కొనుగోలు చేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు.మల్లికాంబ మనోవికాస కేంద్రం వ్యవస్థాపకురాలు రామలీల, ఈసీ సభ్యుడు కల్యాణ్‌తో కలిసి ప్రత్యేక విద్యార్థులు వరంగల్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను సందర్శించిన సీపీ ఎన్.శ్వేత విద్యార్థులు రూపొందించిన వివిధ చేతిపనులను పరిశీలించి కొనుగోలు చేశారు. వారి సృజనాత్మకత, నైపుణ్యాలను అభినందించారు.ప్రత్యేక విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, వారి ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుందని సీపీ పేర్కొన్నారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి ప్రతిభను ప్రోత్సహించడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, ఏఆర్ అదనపు డీసీపీ సురేష్, ఆర్ఐ (అడ్మిన్) సర్జన్ రాజ్, వెల్ఫేర్ ఆర్ఐ సతీష్, ఆర్ఐ శ్రీధర్, మల్లికాంబ మనోవికాస కేంద్రం సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

- **మందనపల్లిలో ఎర్రజెండా ఆవిష్కరణ.. అమరవీరులకు ఘన నివాళులు**

ఆలేరు, నవంబర్ 7(సమయం న్యూస్)



అమరవీరుల పోరాట స్ఫూర్తితో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఐక్యంగా పోరాటాల్లోకి రావాలని కోరారు. ఆలేరు మండలం మందనపల్లి గ్రామంలో శనివారం అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు కామ్రేడ్ కర్రె స్వామి ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఇక్కిరి సహదేవ్ మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం, సమసమాజ స్థాపన కోసం పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. వారి పోరాట స్ఫూర్తి ప్రజా ఉద్యమాలకు నిరంతరం ఉత్తేజాన్ని, చైతన్యాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజలను ఆకట్టుకునే హామీలు ఇవ్వడమే తప్ప వాటిని ఆచరణలో పెట్టడం లేదని అన్నారు. గత 70 ఏళ్లుగా అధికారంలో కొనసాగుతున్న పాలకవర్గాలు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని, ప్రజలకు అందుబాటులో ఉండకుండా మాటలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు.దేశంలో 'దున్నేవాడికే భూమి' అనే నినాదాన్ని కమ్యూనిస్టు విప్లవకారులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారని, ప్రజా పోరాటాల ఫలితంగా లక్షలాది ఎకరాల భూములను పేదలు సాధించుకున్నారని గుర్తుచేశారు. ప్రజల హక్కులు, భూమి, జీవనోపాధి కోసం సాగిన పోరాటాలే సమాజంలో మార్పునకు పునాదులని అన్నారు. దోపిడీ పాలకవర్గ పార్టీలకు ప్రత్యామ్నాయంగా విప్లవ ఉద్యమాలను బలోపేతం చేయాలని, ప్రజలు విప్లవ పార్టీ వెనుక ఐక్యంగా సమీకృతం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్. జనార్ధన్, జిల్లా నాయకులు కల్లెపు అడివయ్య, ఆర్. సీత, మందనపల్లి ఉపసర్పంచ్ పద్మ శశిరేఖ, పీపీడబ్ల్యూ జిల్లా నాయకురాలు తమ్మడి ఉమా, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మారుజోడు సిద్ధేశ్వర్, నాయకులు మామిడాల బాల మల్లేష్, ఆర్. ఉదయ్, తమ్మడి అంజయ్య, తమ్మడి రమేష్, దారా యాదగిరి, పుర్మ చంద్రయ్య, కుర్రి మార్కండేయ, సుంచు రాములు, మావురపు కిష్టారెడ్డి, కొమ్మిడి గోపాల్ రెడ్డి, గోవింద్, పరమేశ్ పాల్గొన్నారు.

తెలంగాణ తరపున జాతీయ క్రికెట్ పోటీలకు నారాయణపేట విద్యార్థి

నారాయణపేట, నవంబర్, 07(సమయం న్యూస్)



నారాయణపేటలోని శ్రీ సాయి జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి మహ్మద్ అఫ్వాన్ ఎస్‌జీఎఫ్ (SGF) జాతీయ స్థాయి అండర్19 క్రికెట్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికయ్యాడు.మధ్య ప్రదేశ్‌లో జరగనున్న ఈ జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు తరపున అఫ్వాన్ పాల్గొననున్నాడు.ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, తన క్రీడా నైపుణ్యాన్ని చాటుకున్న అఫ్వాన్ జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా శ్రీ సాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అఫ్వాన్‌ను ప్రత్యేకంగా అభినందించి, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రానికి, నారాయణపేట జిల్లాకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్‌డీసీఏ క్రికెట్ కోచ్ అజయ్ కూడా అఫ్వాన్‌ను అభినందించారు.ఈ విజయంపై కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

రామచందర్ రావు తో గడిల నరేష్ భేటీ

ఖమ్మం, నవంబర్ 7 : (సమయం న్యూస్



భారతీయ జనతా పార్టీ తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచందర్ రావు తో ఖమ్మం బిజెపి వన్ టౌన్ అధ్యక్షుడు గడిలా నరేష్ భేటీ అయ్యారు. శనివారం హైదరాబాద్ లోని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు నివాసంలో గడిలా నరేష్ కలిశారు. ఈసందర్భంగా టౌన్ అధ్యక్షుని గా ఎన్నికై 23 నెలల కాల వ్యవధిలో పార్టీ ఆదేశించిన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఖమ్మం నగరంలో పార్టీ ఆఫీస్ ఓపెనింగ్ చేసిన వివరాన్ని తెలియ చేయటమే కాకుండా పార్టీ సంస్థగాతా విషయాలు పార్టీ బలోపేతానికి చేస్తున్న విది విధానాలను నరేష్, రామచందర్ రావు కు వివరించారు ముందస్తు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు ప్రకటించారు నరేష్. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు కూడా ఖమ్మం లో ప్రస్తుతం జరుగుతున్న ఎం ఎల్ సి ఎన్నికల్ మెంట్ పైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతేకాక రానున్న ఖమ్మం కార్పొరేషన్ ఎలక్షన్ పైన కూడా దృష్టిసారించాలని, గెలుపు దిశగా పనిచేయాలని సూచించారు. తమ భేటీలో ఎంశంపై ఈ అంశంపై చర్చలు జరిగినట్లు, ఖమ్మంలో పార్టీ బలోపేతం పై చేస్తున్న కృషికి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్రావు సంతోషం వ్యక్తం చేయటం జరిగిందని గడీల నరేష్ వెల్లడించారు.

ఎంఈఓ భీమ్ సింగ్ పలు పాఠశాలలను అకస్మాత్తుగా తనిఖీ చేశారు

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 7:

ముసిపల్లి మండలంలోని మల్లారెడ్డిపేట తదితర ప్రభుత్వ పాఠశాలలను మండల విద్యాధికారి బీమ్ సింగ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ముఖ్యంగా 3, 4, 5 తరగతుల విద్యార్థుల తెలుగు, గణిత అంశాల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (FLN) స్థాయిని పరిశీలించి వారి ప్రతిభను అంచనా వేశారు.అలాగే విద్యార్థుల అభ్యసన ప్రగతి, FLN Performance, FLN Spot Assessment, రాగిజావ పంపిణీ రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న మిడ్‌లైన్ పరీక్షల తీరును కూడా పరిశీలించారు.విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రాబోయే రెండు నెలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడి ఆశించిన స్థాయికి చేరుకునేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని ఆదేశించారు.విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి మరువలేనిది



మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ సంగారెడ్డి పట్టణ అభివృద్ధే లక్ష్యం

- **మౌలిక సదుపాయాలకు పెద్దపీట**

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 7

సంగారెడ్డి పట్టణ అభివృద్ధే లక్ష్యం - మౌలిక సదుపాయాలకు పెద్దపీటసంగారెడ్డి పట్టణంలోని 9వ వార్డు నప్తగిరి కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను, అదేవిధంగా 35వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. నాణ్యతతో కూడిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కూన వనిత సంతోష్ కౌన్సిలర్ లు శ్రీలత శ్రీశైలం, నర్సమ్మ ప్రసాద్ ,సంగీత మహేష్ సతీష్ రెడ్డి ,వంశీ, శైలేష్ రెడ్డి,రవి నాయక్, కాంగ్రెస్ నాయకులు సురేష్, కిరణ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు



గోలన్ కొండ, శర్భనాపురంలో 75 దూడలకు నట్టల నివారణ

ఆలేరు, నవంబర్ 07(సమయం న్యూస్)



పశుసంపద అభివృద్ధితో పాటు దూడల ఆరోగ్య పరిరక్షణకు పశుపోషకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ యాకూబ్ సూచించారు. ఆలేరు మండలంలోని గోలన్ కొండ, శర్భనాపురం గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం దూడలకు నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూడల ఎదుగుదలకు నట్టల నివారణ మందులు ఎంతో కీలకమని తెలిపారు. దూడల శరీరంలో నట్టలు ఉండటం వల్ల వాటి ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. నిర్ణీత వ్యవధిలో నట్టల నివారణ మందులు వేయించడం ద్వారా దూడలు ఆరోగ్యంగా ఎదగడంతో పాటు పశుసంపద వృద్ధికి దోహదపడుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు గ్రామాలకు చెందిన మొత్తం 75 దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందులు అందించినట్లు అధికారులు తెలిపారు. పశుసంవర్ధక శాఖ చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోలన్ కొండ సర్పంచ్ యాదిరెడ్డి, శర్భనాపురం మదర్ డెయిరీ పాల కేంద్రం చైర్మన్ గడ్డమీది పరశురాములు, పశువైద్యాధికారి డాక్టర్ యాకూబ్, జేవీఓ నరసింహ, గోపాలమిత్రులు సుధాకర్, కుమారస్వామి, శ్రీకాంత్, గోపి, గ్రామ రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

కార్తీకోత్సవాలకు మంత్రులకు ఆహ్వానం

- **ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

ఆలేరు, నవంబర్ 07(సమయం న్యూస్):



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న కార్తీకోత్సవాలకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవాలకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర మంత్రులను కలిసి కార్తీకోత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని బీర్ల ఐలయ్య మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కార్తీకోత్సవాల విశేషాలను వివరించి, మూడు రోజుల పాటు జరిగే వేడుకలకు హాజరుకావాలని కోరారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమని పేర్కొన్నారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నిర్వహించే కార్తీకోత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనాలు, ప్రత్యేక పూజలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేసి కార్తీకోత్సవాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె. భవానీ శంకర్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మందనపల్లి అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తా

- **గ్రామ సమస్యలను పరిష్కరించి నియోజకవర్గంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

ఆలేరు, నవంబర్ 07ఆ(సమయం న్యూస్):



ఆలేరు మండలం మందనపల్లి గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని విధాలా సహకారం అందిస్తూ, గ్రామాన్ని నియోజకవర్గంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లే మార్గంలో గత 30 ఏళ్లుగా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న పాత విద్యుత్ లైన్ సమస్యను ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరించినట్లు గ్రామ ప్రజాప్రతినిధులు తెలిపారు. 11 కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులు పూర్తయ్యాయని ఎమ్మెల్యేకు వివరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించడంతో హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని చెరువు పూర్తిస్థాయిలో నిండేందుకు కందిగడ్డ వద్ద కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయాలని, గ్రామంలో మురుగునీటి సమస్య పరిష్కారానికి అండర్ డ్రైనేజీ వ్యవస్థను మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి పెండింగ్ పనులను త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సానుకూలంగా స్పందిస్తూ మందనపల్లి తన సొంత గ్రామం వంటిదని, గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. అవసరమైన సహకారం అందిస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తానని, ఆలేరు నియోజకవర్గంలోనే మందనపల్లిని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కలిసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఉత్కంఠ పోరులో భారత్‌దే పైచేయి!

న్యూజిలాండ్‌పై నాలుగు పరుగుల తేడాతో విజయం



- వర్షం అంతరాయంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితం
- ఐదు వన్డేల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో టీమిండియా
- 134 పరుగులకే కుప్పకూలిన కివీస్ బ్యాటింగ్
- నాలుగు వికెట్లతో చెలరేగిన గుర్నూర్ బ్రార్
- 113 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయినా భారత్‌కు విజయం

వెల్లింగ్టన్, నవంబర్ 7 (సమయం న్యూస్): న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో భారత్ ఉత్కంఠ విజయాన్ని అందుకుంది. వర్షం అంతరాయం కలిగించిన ఈ పోరులో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం నాలుగు పరుగుల తేడాతో గెలుపొందినట్లు మ్యాచ్ వివరాలు వెల్లడిస్తున్నాయి. తొలుత భారత బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ 41 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌటైంది. అనంతరం 135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ కూడా కివీస్ బౌలర్ల ధాటికి తడబడింది. ఏడు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసిన సమయంలో వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. వర్షం కారణంగా ఆట తిరిగి కొనసాగించే పరిస్థితి లేకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితాన్ని నిర్ణయించారు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.



భారత బౌలర్ల విజృంభణ

టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. భారత బౌలర్లు ఆరంభం నుంచే కట్టుదిట్టంగా బంతులు సంధించి న్యూజిలాండ్ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టారు. అర్ష్‌దీప్ సింగ్ తొలి ఓవర్‌ను పరుగులేమీ ఇవ్వకుండా పూర్తి చేయగా, రెండో ఓవర్‌లో ఆకిబ్ నబీ టిమ్ సీఫర్ట్‌ను పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత విల్ యంగ్ (6)ను కూడా నబీ ఔట్ చేశాడు. హెన్రీ నికోల్స్ (11)ను అన్షుల్ కాంబోజ్ బౌల్డ్ చేయడంతో న్యూజిలాండ్ 19 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

53 పరుగులకే ఐదు వికెట్లు

ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్‌ను ఆదుకునేందుకు డారిల్ మిచెల్ ప్రయత్నించాడు. టామ్ లాథమ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు కృషి చేశాడు. అయితే గుర్నూర్ బ్రార్ బౌలింగ్‌లో లాథమ్ (7) ఔటయ్యాడు. అదే ఓవర్‌లో గ్లెన్ ఫిలిప్స్‌ను పరుగులేమీ చేయకుండానే పెవిలియన్‌కు పంపించడంతో కివీస్ 53 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. భారత బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ బ్యాటింగ్ క్రమం కుప్పకూలింది.

మిచెల్ ఒంటరి పోరాటం

ఒకవైపు వికెట్లు పడుతున్నా డారిల్ మిచెల్ మాత్రం పట్టుదలతో బ్యాటింగ్ చేశాడు. మిచెల్ శాంట్నర్‌తో కలిసి ఆరో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. మిచెల్ 104 బంతుల్లో 55 పరుగులు చేసి అర్ధశతకంతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. శాంట్నర్ 38 బంతుల్లో 31 పరుగులు చేసి సహకరించాడు. అయితే అక్షర్ పటేల్ బౌలింగ్‌లో మిచెల్ ఔటవడంతో న్యూజిలాండ్ మళ్లీ ఒత్తిడిలో పడింది. అనంతరం గుర్నూర్ బ్రార్ శాంట్నర్‌ను పెవిలియన్‌కు పంపించాడు. చివర్లో కైల్ జేమీసన్ (7)ను అక్షర్ పటేల్ బౌల్డ్ చేయగా, నాథన్ స్మిత్ (3)ను గుర్నూర్ బ్రార్ ఔట్ చేశాడు. బ్లెయిర్ టిక్నర్ (2)ను అన్షుల్ కాంబోజ్ బౌల్డ్ చేయడంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 41 ఓవర్లలో 134 పరుగుల వద్ద ముగిసింది. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ 10 ఓవర్లలో 30 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఆకిబ్ నబీ, అక్షర్ పటేల్, అన్షుల్ కాంబోజ్ రెండేసి వికెట్లు సాధించారు.

స్వల్ప లక్ష్యానికీ భారత్ తడబాటు

135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కూడా వెల్లింగ్టన్ పిచ్‌పై కష్టాలు తప్పలేదు. బౌలర్లకు అనుకూలించిన పరిస్థితుల్లో భారత బ్యాటర్లు పరుగులు సాధించేందుకు ఇబ్బందిపడ్డారు. రోహిత్ శర్మ 23 పరుగులు చేయగా, శ్రేయాస్ అయ్యర్ 30 పరుగులతో రాణించాడు. కేఎల్ రాహుల్ 26 పరుగులతో అజేయంగా నిలిచాడు. న్యూజిలాండ్ బౌలర్లలో కైల్ జేమీసన్, జాకబ్ డఫీ చెరో మూడు వికెట్లు పడగొట్టి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. దీంతో స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలోనే భారత్ ఏడు వికెట్లు కోల్పోయింది.

వర్షమే ఫలితాన్ని తేల్చింది

భారత్ ఏడు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసిన సమయంలో వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయింది. అప్పటికి డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నిర్ణయించిన లక్ష్యాన్ని భారత్ అధిగమించినట్లు మ్యాచ్ వివరాలు పేర్కొంటున్నాయి. దీంతో నాలుగు పరుగుల తేడాతో టీమిండియాను విజేతగా ప్రకటించినట్లు సమాచారం. కివీస్ బౌలర్లు పోరాడినప్పటికీ వర్షం కారణంగా మ్యాచ్‌ను కొనసాగించే అవకాశం లేకపోయింది. నాలుగు వికెట్లతో న్యూజిలాండ్ బ్యాటింగ్ పతనంలో కీలక పాత్ర పోషించిన గుర్నూర్ బ్రార్‌కు మ్యాచ్ ఉత్తమ ఆటగాడి పురస్కారం దక్కినట్లు సమాచారం. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యాన్ని సాధించింది. మొదటి రెండు మ్యాచ్‌ల్లో విజయాలు అందుకున్న టీమిండియా తదుపరి పోరులోనూ గెలిచి సిరీస్‌పై పట్టు మరింత బిగించాలని భావిస్తోంది.

టెస్టులకు రివర్స్ స్వింగ్ కింగ్ గుడ్‌బై!

- 13 ఏళ్ల సుదీర్ఘప్రస్థానానికి మహమ్మద్ షమీ ముగింపు
- అరంగేట్రం చేసిన రోజునే వీడ్కోలు నిర్ణయం
- 64 టెస్టులు.. 229 వికెట్లు.. ఆరుసార్లు ఐదు వికెట్ల ఘనత
- తొలి టెస్టులోనే తొమ్మిది వికెట్లతో సంచలనం
- వన్డేలు, టీ20లు, ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో కొనసాగనున్న పేసర్



కోల్‌కతా, నవంబర్ 7 (సమయం న్యూస్): భారత క్రికెట్‌లో తన పదునైన బంతులతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ పేసర్ మహమ్మద్ షమీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికినట్లు ప్రకటించాడు. పదమూడేళ్ల సుదీర్ఘ టెస్టు ప్రయాణానికి ముగింపు పలుకుతూ సామాజిక మాధ్యమాల ద్వారా తన నిర్ణయాన్ని వెల్లడించినట్లు సమాచారం. 2013 నవంబర్ 7న వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా టెస్టుల్లో అరంగేట్రం చేసిన షమీ, సరిగ్గా పదమూడేళ్ల తర్వాత అదే తేదీన ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. టెస్టులకు వీడ్కోలు పలికినప్పటికీ వన్డేలు, టీ20లు, ఐపీఎల్‌తోపాటు దేశవాళీ క్రికెట్‌లో కొనసాగనున్నట్లు తెలిపాడు. 2013 నవంబర్‌లో కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానంలో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టుతో షమీ అంతర్జాతీయ టెస్టు ప్రస్థానం ప్రారంభమైంది. తొలి మ్యాచ్‌లోనే తన బౌలింగ్ ప్రతిభను చాటుకున్నాడు. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి తొమ్మిది వికెట్లు పడగొట్టి క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. పదునైన పేస్ బౌలింగ్, కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్, బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగల సామర్థ్యంతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బందులకు గురిచేశాడు. ముఖ్యంగా పాత బంతితో రివర్స్ స్వింగ్ రాబట్టడంలో షమీ ప్రత్యేక నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. భారత్ తరఫున 64 టెస్టులు ఆడిన షమీ మొత్తం 229 వికెట్లు పడగొట్టాడు. ఆరుసార్లు ఒక ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు సాధించాడు. 27.71 బౌలింగ్ సగటు, 50.2 స్ట్రైక్ రేట్‌తో తన టెస్టు ప్రస్థానాన్ని కొనసాగించాడు. స్వదేశంలో మరింత ప్రభావవంతమైన బౌలర్‌గా నిలిచిన షమీ 22.1 సగటుతో వికెట్లు సాధించాడు. భారత గడ్డపై ప్రతి 42.6 బంతులకు ఒక వికెట్ పడగొట్టిన ఘనత అతడి సొంతం. భారత్ తరఫున అత్యధిక టెస్టు వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో తొలి 15 స్థానాల్లో చోటు సంపాదించాడు. స్వదేశంలోనే కాకుండా విదేశీ పర్యటనల్లోనూ షమీ తన బౌలింగ్‌తో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పర్యటనల్లో ప్రత్యర్థి బ్యాటర్లకు సవాల్ విసిరాడు. వేగంతోపాటు రివర్స్ స్వింగ్‌ను సమర్థంగా వినియోగించి కీలక సమయాల్లో వికెట్లు సాధించాడు. 2016లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లోనూ తన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. భారత పేస్ దళంలో కీలక సభ్యుడిగా ఎన్నో విజయాల్లో భాగస్వామి అయ్యాడు. 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ షమీ చివరి టెస్టు మ్యాచ్‌గా నిలిచింది. ఆ తర్వాత గాయాలు, ఫిట్‌నెస్ సమస్యల కారణంగా టెస్టు జట్టుకు దూరమయ్యాడు. తిరిగి జట్టులోకి రావడానికి ప్రయత్నించినప్పటికీ టెస్టు క్రికెట్‌లో మరో అవకాశం దక్కలేదు. చివరకు సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడైంది. టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు సందర్భంగా తన ప్రయాణంలో సహకరించిన కోచ్‌లు, శిక్షకులు, ఫిజియోలు, సహచర ఆటగాళ్లకు షమీ కృతజ్ఞతలు తెలిపినట్లు సమాచారం. ముఖ్యంగా తనపై ప్రేమాభిమానాలు చూపిన క్రికెట్ అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశాడు. ఎన్నో గాయాలు, ఒడిదుడుకులు ఎదురైనా భారత జట్టు కోసం మైదానంలో పోరాడిన అనుభవాలను గుర్తుచేసుకున్నాడు. టెస్టు క్రికెట్ నుంచి తప్పుకున్నప్పటికీ షమీ ఇతర ఫార్మాట్లలో కొనసాగనున్నాడు. వన్డేలు, టీ20లతోపాటు ఐపీఎల్, బెంగాల్ తరఫున దేశవాళీ క్రికెట్‌లో ఆడనున్నట్లు తెలిపాడు. తన అనుభవాన్ని వినియోగించుకుని పరిమిత ఓవర్ల క్రికెట్‌లో రాణించాలనే లక్ష్యంతో ఉన్నట్లు సమాచారం. భారత టెస్టు క్రికెట్‌లో పేస్ బౌలింగ్‌కు కొత్త పదును తీసుకొచ్చిన ఆటగాళ్లలో షమీ ఒకడిగా గుర్తింపు పొందాడు. ముఖ్యంగా పాత బంతితో రివర్స్ స్వింగ్ రాబట్టి ప్రత్యర్థి బ్యాటర్లను బోల్తా కొట్టించే అతడి నైపుణ్యం అభిమానులకు గుర్తుండిపోతుంది. పదమూడేళ్ల టెస్టు ప్రయాణంలో 229 వికెట్లతో తనదైన ముద్ర వేసిన షమీ నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



ఐఓఏ అథ్లెట్ల కమిషన్ చైర్‌పర్సన్‌గా సింధు

ఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్ల కమిషన్ నూతన నాయకత్వం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. స్టార్ షట్లర్ పి.వి.సింధు ఐఓఏ అథ్లెట్ల కమిషన్ చైర్‌పర్సన్‌గా.. భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అగ్రశ్రేణి వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, స్విమ్మర్ సాజన్ ప్రకాశ్ ఐఓఏ సర్వసభ్య సమావేశానికి అథ్లెట్ల కమిషన్ ప్రతినిధులుగా ఎంపికయ్యారు. ఈ నాలుగు పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో అభ్యర్థులంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి సంజయ్ శ్రీవాస్తవ ప్రకటించారు. ఈ నలుగురు క్రీడాకారులు 2026-2030 కాలానికి గాను నాలుగేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. డిసెంబరు 5న ఐఓఏ ఎన్నికల అనంతరం ఏర్పాటయ్యే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సింధు, హర్మన్‌ప్రీత్ సభ్యులుగా చేరతారు. ఐఓఏ సర్వసభ్య సమావేశం ప్రతినిధులుగా ఎన్నికైన చాను, సాజన్.. డిసెంబరు 5న జరిగే ఎన్నికల్లో ఓటు వేసే హక్కు కలిగి ఉంటారు. పది మంది సభ్యులతో కూడిన ఐఓఏ అథ్లెట్ల కమిషన్‌లో సలీమా టెటె (హాకీ), స్వప్నిల్ కుసాలె (షూటింగ్), భవానీ దేవి (ఫెన్సింగ్), తజిందర్‌పాల్ సింగ్ తూర్ (షాట్‌పుట్), బొంబేలా దేవి (ఆర్చరీ), మంజీత్‌సింగ్ (కయాకింగ్-కనోయింగ్) సభ్యులుగా ఉన్నారు.



ధోనీని 'మాహీ అంకుల్' అని పిలుస్తా: నటి అనుష్క సేన్

కెప్టెన్' కూల్ ఎంఎస్ ధోనీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఆయనను ఒక్కసారైనా నేరుగా చూడాలని ఎంతోమంది ఆశపడుతారు. అలాంటి ధోనీతో తనకు చిన్ననాటి నుంచి ప్రత్యేక అనుబంధం ఉందని నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ అనుష్క సేన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆయనను తాను ప్రేమగా 'మాహీ అంకుల్' అని పిలుస్తానని.. ధోనీ తనను చిక్కీ అని అంటారని తెలిపారు. గతంలో ధోనీతో కలిసి పలు వాణిజ్య ప్రకటనల్లో నటించడం వల్ల తమ మధ్య మంచి అనుబంధం ఏర్పడిందన్నారు. పదేళ్ల క్రితం మొదటిసారి ధోనీని కలిసినప్పటి విషయాలను ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తామిద్దరం రాంచీ నుంచే వచ్చామన్నారు. ధోనీతో కలిసి తాను ఏడేళ్లపాటు 21 ప్రకటనల్లో నటించానని తెలిపారు. ఇప్పటికీ ఎక్కడైనా కలిస్తే.. ఆయన ఎంతో ప్రేమగా దగ్గరకు తీసుకుంటారన్నారు. 'యహా మై ఘర్ ఘర్ ఖేలీ' సీరియల్‌తో అనుష్క సేన్ ఏడేళ్లకే తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించారు. అనేక వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 'బాల్ వీర్'లో మెహర్ పాత్ర ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. దేవోంకే దేవ్ మహదేవ్, ఝాన్సీ కీ రాణి వంటి వాటిల్లో నటించారు.

ధినిధికి మరో కాంస్యం

డకార్ (సెనెగల్): యూత్ ఒలింపిక్ గేమ్స్‌లో భారత యువ స్విమ్మర్ ధినిధి దేశింగు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఒకే ఎడిషన్‌లో రెండు వ్యక్తిగత పతకాలు నెగ్గిన భారత తొలి అథ్లెట్‌గా రికార్డు కెక్కింది. మహిళల 100 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచిన ఈ 16 ఏండ్ల కర్ణాటక అమ్మాయి 200 మీటర్ల పోటీలనూ కాంస్య పతకాన్ని ముద్దాడింది. శుక్రవారం జరిగిన తుదిరేసును ధినిధి 2 నిమిషాల 02.28 సెకండ్లతో మూడో స్థానంతో ముగించింది.





వచ్చిందమ్మా.. మదరాసి రబ్బరు బొమ్మ

సాయి శ్రీనివాస్, నేహా శెట్టి

'టైసన్ నాయుడు'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని సాగర్ కె.చంద్ర తెరకెక్కించారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. నేహా శెట్టి కథానాయిక. ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "మదరాసి రబ్బరు బొమ్మ.." అంటూ సాగిన ఈ మాస్ పాటకి భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా.. సురేశ్ గంగుల సాహిత్యమందించారు. నల్గొండ గద్దర్ నర్సన్న, రోహిణి సోరట్ సంయుక్తంగా ఆలపించారు. క్రీడా నేపథ్య అంశాలతో ముడిపడిన ఈ యాక్షన్ డ్రామాలో బెల్లంకొండ శ్రీనివాస్ శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనున్నారు.



ఇన్‌స్టాగ్రామ్ హ్యాక్..



వ్యక్తిగత కంటెంట్ లీక్‌పై సురేఖా వాణి ఆగ్రహం

టాలీవుడ్ నటి సురేఖా వాణి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై ఆమె తీవ్రంగా స్పందించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా హ్యాక్ అయిందని తెలిపారు. తన వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని ఆమె వెల్లడించారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో నోట్ పెట్టారు. మీమ్ పేజీలు, మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానళ్లు, వ్యక్తులు ఎవరైనా సరే.. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆ కంటెంట్‌ను షేర్ చేయడం, రీపోస్ట్ చేయడం తక్షణమే ఆపాలని నటి విజ్ఞప్తి చేశారు. "ఈ కంటెంట్‌ను షేర్ చేస్తున్న ఖాతాలు, వ్యక్తులను గుర్తించి, ఆధారాలను సేకరిస్తాను. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను" అని హెచ్చరించారు. వ్యూస్, రీచ్, పబ్లిసిటీ కోసం.. ఈ పరిస్థితిని ఎవరూ తమకు అనుకూలంగా మార్చుకోవద్దని కోరారు. తన వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని, ఇది చాలా తీవ్రమైన అంశమని ఆమె పేర్కొన్నారు. 2005లో ఇండస్ట్రీకి వచ్చిన సురేఖా వాణి.. ఆ తర్వాత వరుసగా హిట్ సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. 'భద్ర', 'బొమ్మరిల్లు', 'ఏమాయ చేశావే', 'నాయక్', 'బాద్ షా' వంటి సినిమాలతో మెప్పించారు.



సంక్రాంతికి సందడి

భాషతో సంబంధం లేకుండా కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరించే ప్రయత్నం చేస్తున్నారు కథానాయిక మాళవిక మోహనన్. ఇటీవలే 'సర్దార్ 2' చిత్రంలో నటించారు. ప్రస్తుతం విలక్షణ నటుడు విజయ్ సేతుపతితో కలిసి 'పాకెట్ నోవెల్'తో తెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు మాళవిక. ఇటీవలే ఈ సినిమాని డిసెంబరులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలొచ్చాయి. తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఈ నేపథ్యంలోనే "పేజీలు తిరుగుతున్నాయి.. తేదీ ఖరారైంది. 'పాకెట్ నోవెల్' ఈ సంక్రాంతికి రాబోతోంది!' అనే క్యాప్షన్‌తో ఒక కొత్త పోస్టర్‌ని సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. ఈ పోస్టర్‌లో విజయ్ సేతుపతి, మాళవిక, రాజ్ బి.శెట్టి తదితరులు.. వాళ్ల మధ్యలో ఒక డబ్బుల బ్యాగ్ కనిపించిన తీరు సినీప్రియుల్ని ఆకట్టుకుంది. త్యాగరాజన్ కుమార రాజా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాని టైలర్ డర్డెన్, కినో ఫిస్ట్ నిర్మాణ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇందులో రాజ్ బి.శెట్టి ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.



రూ.6 కోట్ల కోసం హానీట్రాప్?

6 కోట్లు ఇవ్వకపోవడంతోనే దాడి?

టాలీవుడ్ హీరోయిన్ దొంగతనం కేసులో ట్విస్ట్

కొచ్చి, నవంబర్ 6 (సమయం న్యూస్) : కొచ్చిలో ఒక యువ వైద్యుడిపై జరిగిన భౌతిక దాడి ఘటన కేరళ రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ దారుణ ఘటన వెనుక టాలీవుడ్లో మత్తు వదలరా సినిమాలో నటించిన నటి వేసిన కిలాడీ స్కెచ్ ఉన్నట్లు పోలీసుల విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. నటి అతుల్య చంద్ర ప్రధాన సూత్రధారిగా, నటుడు బిపిన్ పెరుంపల్లితో కలిసి ఏకంగా రూ. 6 కోట్లు దండుకునేందుకు ప్రయత్నించడం, ఆ తర్వాత బ్లాక్ మెయిల్‌కు పాల్పడటం ఇప్పుడు సర్వత్రా హాట్ టాపిక్‌గా మారింది. అతుల్య చంద్ర బంధువుల అమ్మాయితో సదరు డాక్టర్‌కు సన్నిహిత సంబంధాలు, స్నేహం ఉంది. ఆ పరిచయాన్నే ఆసరాగా చేసుకున్న నటి అతుల్య, నటుడు బిపిన్ పెరుంపల్లి కలిసి డాక్టర్ వద్ద నుంచి భారీగా డబ్బు గుంజాలని ప్లాన్ వేశారు. ఇద్దరి మధ్య ఉన్న ఒక వివాదాన్ని పరిష్కరిస్తామని నమ్మబలికి ఫ్లాట్ కి రప్పించుకుని అనంతరం, డాక్టర్‌ను ఏకంగా రూ. 6 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే, అంత భారీ మొత్తం తన వద్ద లేదని, తానివ్వలేనని డాక్టర్ తేల్చి చెప్పడంతో ఈ ముఠా తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టింది. డాక్టర్‌కు సంబంధించిన అత్యంత వ్యక్తిగత వీడియో ఫుటేజ్, ప్రైవేట్ వాట్సాప్ చాట్స్‌ను సోషల్ మీడియాలో లీక్ చేస్తామంటూ తీవ్ర స్థాయిలో బెదిరింపులకు దిగింది. వారి బ్లాక్ మెయిల్‌కు కూడా ఆ డాక్టర్ లొంగకపోవడంతో, పక్కా ప్లాన్ ప్రకారం అతనిపై అత్యంత దారుణంగా దాడికి పాల్పడ్డారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే, పక్కా పథకం ప్రకారం డాక్టర్‌ను 'హనీట్రాప్' చేశారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసుకు సంబంధించి త్వరలోనే అతుల్య బంధువు వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేయనున్నారు. ఇక ఈ కేసులో పాల్గొన్న నిందితులకు పక్కా క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నటుడు బిపిన్ పెరుంపల్లి డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై గతంలోనే ఎన్‌డీపీఎస్ (డ్రగ్స్) కేసులతో సహా దాడులకు పాల్పడిన సుమారు 8 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం పరారీలో ఉన్న మరో నిందితుడైన జిమ్ ట్రైనర్ వద్ద డాక్టర్‌కు సంబంధించిన మొబైల్ ఫోన్లు (వ్యక్తిగత డేటా ఉన్న ఫోన్లు) ఉన్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, ఈ సెలబ్రిటీల ముఠా వెనుక ఉన్న చీకటి కోణాలను వెలికితీసే పనిలో ఉన్నారు.



PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

పుస్తకమే మనిషికి జీవితకాల నేస్తం

- **పఠనంతో విజ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకతకు పదును**
- **నవచేతన బుక్ హౌస్ పుస్తక ప్రదర్శన ప్రారంభించిన ఎంపీ కడియం కావ్య**



హనుమకొండ, నవంబర్ 7 (సమయం న్యూస్)

పుస్తకం మనిషికి మంచి నేస్తమని, జీవితాంతం జ్ఞానాన్ని అందించే గొప్ప సంపద అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. జాతీయ పుస్తక వారోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ అశోక కాంప్లెక్స్‌లోని నవచేతన బుక్ హౌస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను శనివారం ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెంపొందడంతో పాటు సమాజంపై అవగాహన, జీవితాన్ని చూసే దృక్పథం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నేటి డిజిటల్ యుగంలో సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల ప్రభావం పెరుగుతున్నప్పటికీ పుస్తక పఠనానికి ఉన్న ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదన్నారు.విద్యార్థులు, యువత ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు. పుస్తకాలు సమాచారాన్ని అందించడమే కాకుండా నైతిక విలువలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలని, తల్లిదండ్రులు చిన్ననాటి నుంచే పిల్లలకు పుస్తకాలు చదివే అలవాటు నేర్పించాలని కోరారు.పుస్తక ప్రదర్శనలు పాఠకుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు రచయితలు, సాహితీవేత్తలు, పాఠకులకు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు. పఠన సంస్కృతిని ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని నవచేతన బుక్ హౌస్ నిర్వాహకులకు సూచించారు. అనంతరం ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను ఎంపీ కడియం కావ్య సందర్శించి, పలు రకాల పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించారు. నచ్చిన పుస్తకాలను స్వయంగా కొనుగోలు చేశారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, గడ్డం రాజిరెడ్డి, వల్లాల వెంకటరమణ, వేణుమాధవ్, తోట సుధాకర్ పాల్గొన్నారు.

రైతులను తక్షణమే ఆదుకోండి!

- **సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్**

ఖమ్మం, నవంబర్ 7 : (సమయం న్యూస్)

మురసు తుఫాన్, ఈదురు గాలుల దాటికి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వరి, పత్తి, మిర్చి తదితర పంటలు నేలకొరిగి రైతులకు అపార నష్టం వాటిల్లిందని, తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఆదుకోవాలని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.ఈ మేరకు అయన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. పంటలు చేతికొచ్చే ఆఖరి క్షణంలో సంభవించిన ఈ ప్రకృతి వైపరీత్యం రైతులను కోలుకోలేని దెబ్బ తీసిందని, సాగు పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక రైతన్నలు తీవ్ర మానసిక ఆందోళనలో, ఇబ్బందుల్లో కూరుకుపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఖమ్మం జిల్లాలో సమోదైన ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 83,000 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఆయన తెలిపారు. అందులో అత్యధికంగా 50,000 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతినగా, 25,000 ఎకరాల్లో వరి, 8,000 ఎకరాల్లో మిర్చి పంటలు మునిగి పోయి రైతులకు అపార నష్టాన్ని మిగిల్చాయని వివరించారు. ఖమ్మం జిల్లాతో పాటు పొరుగు జిల్లాలో కూడా తీవ్ర ప్రభావం పడిందని, అక్కడ మరో 10,000 ఎకరాలకు పైగా పంటలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఇందులో వరి 6,200 ఎకరాలు, పత్తి 2,700 ఎకరాలు, మినుము 1,200 ఎకరాల చొప్పున పంటలు దెబ్బతిన్నట్లు ఆయన వెల్లడించారు.జిల్లాలోని సత్తుపల్లి, వెనుబల్లి, మధిర, ఏన్కూరు, తల్లాడ, వేంసూరు, జూలూరుపాడు, కొణిజర్ల మండలాల్లో తుఫాను ప్రభావం చాలా తీవ్రంగా ఉందని నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యంగా సత్తుపల్లి మండలంలో 21.8 సెంటీమీటర్లు, పెనుబల్లి మండలంలో 22.52 సెంటీమీటర్ల మేర కురిసిన వర్షపాతం వల్ల కోతకొచ్చిన వరి చేలు నేలవాలి పూర్తిగా నీటమునిగాయని, అలాగే పత్తి కాయలు వర్షానికి తడిసి నల్లబడి పనికిరాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల వల్ల జిల్లా వ్యాప్తంగా రైతులు ఎంతో నష్టపోయి ఆర్థికంగా దిక్కుతోచని స్థితిలో పడ్డారని పేర్కొన్నారు.తుఫాను వల్ల జరిగిన మొత్తం నష్టం విలువ ఎంత అనేది ఇంకా అధికారికంగా లెక్క తేల్చ లేదని నున్నా నాగేశ్వరరావు అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తక్షణమే పర్యటించి సర్వే జరిపి నష్టపోయిన రైతుల వివరాలు, పంట నష్టంపై రాబోయే 23 రోజుల్లో పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆయన కోరారు. అలాగే బాధితులకు తగిన



న్యాయం జరిగేలా పంటల వారీగా ఎకరాకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆహార పంటలైన వరి ధాన్యానికి ఎకరాకు రూ. 30,000, వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి రైతులకు ఎకరాకు రూ. 50,000, అలాగే ఇతర పంటలకు ఎకరాకు రూ. 20,000 చొప్పున ప్రభుత్వం తక్షణ పరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని నున్నా నాగేశ్వరరావు స్పష్టం చేశారు.తుఫాన్, వరదల వల్ల జరిగిన పంట నష్టానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి, సత్వరమే రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. యుద్ధ ప్రాతిపదికన క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి, ఏ రైతు పంట ఎంత నష్టం జరిగిందో వివరాలు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వివరాలు నమోదులో ఎటువంటి అలసత్వాన్ని సహించేది లేదన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఇంతవరకు రైతుకు పరిహారం ప్రకటించలేదని చెప్పారు. కనీసం అధికారులకు రాతపూర్వక ఆదేశాలు కూడా జారీ చేయకపోవడం శోచనీయమని అన్నారు.ముగ్గురు మంత్రులుండి జిల్లాకు ఒరగబెట్టిందేమి లేదని, జిల్లాలోనే వ్యవసాయ శాఖ మంత్రి, ప్రకృతి విపత్తుల శాఖ మంత్రి,నిధులోచ్చే ఆర్థిక మంత్రి ఉన్నా రైతులకు ఇంత వరకు ఒక్క పైసా పరిహారం అందలేదని మండిపడ్డారు.మంత్రులకు రైతులను పట్టించుకునే తీరికలేకుండా పోయిందని అన్నారు.ఇప్పటికైనా జిల్లా మంత్రులు, ప్రభుత్వం స్పందించి తుఫాన్ బాధిత రైతాంగాన్ని,ప్రజలను ఆదుకోవాలని కోరారు.అలాగే ఖమ్మం జిల్లాలో గతంలో ప్రకటించిన కరవు మండలాల్లో తక్షణమే కరవు సహాయక కార్యక్రమాలను చేపట్టాలని డిమాండ్ చేశారు.కరవు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకున్నారు తప్ప బాధిత రైతులకు చేసిందేమి లేదన్నారు. , తక్షణమే కరవు నివారణకు చర్యలు తీసుకుని రైతులను, ప్రజల్ని అన్ని విధాలా ఆదుకోవాలని నున్నా కోరారు.కరవు మండలాలుగా ప్రకటించని మిగతా నాలుగు మండలాలను కూడా కరవు జాబితా లో చేర్చి, రైతులను ఆదుకోవాలని నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో పండుగ వెలుగులు నింపేలా ప్రత్యేక కార్యక్రమాలు

- **జిల్లా వ్యాప్తంగా నవంబర్ 8న**
- **"మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" వేడుకలు***
- **ప్రతి ఇందిరమ్మ ఇంటి ముందు దీపాలు వెలిగించి వేడుకల్లో**

సంగారెడ్డి, నవంబర్ 7:-

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా, కొత్తగా నిర్మించుకున్న ఇళ్లలో లబ్ధిదారులు దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా ఈనెల 8వ తేదీ ఆదివారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చలపతి రావు తెలిపారు.పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తూ, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 3,48,977 ఇళ్లలో ఇప్పటికే 2,06,982 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. "గుడిసెలు లేని తెలంగాణ" లక్ష్య సాధనలో భాగంగా ఈ పథకం ద్వారా వేలాది పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 14,445 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 6,617 ఇండ్లు పూర్తయ్యాయని,7,828 ఇండ్లు వివిధ దశలలో ఉన్నట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 8న ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.జిల్లాలో పూర్తయిన ప్రతి ఇందిరమ్మ ఇంటి ముందు గోడపై "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" లోగోస్టిక్కరింగ్‌తో పాటు లబ్ధిదారుల వివరాలను పెయింటింగ్ ద్వారా పొందుపరిచే ప్రక్రియను నవంబర్ 7వ తేదీలోగా పూర్తి చేయాలని,నవంబర్ 8న



లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి నూతన ఇందిరమ్మ ఇంటి ముందు దీపాలు వెలిగించి, కుటుంబ సభ్యులతో ఫొటోలు తీసి ఇందిరమ్మ ఇండ్లు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు.ప్రతి గ్రామం, వార్డు నుంచి కనీసం రెండు ఫొటోలను సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారుప్రతి గ్రామ పంచాయతీలో లబ్ధిదారుల ఇళ్లకు సంబంధించిన నిర్మాణానికి ముందు, నిర్మాణం పూర్తయిన తర్వాత ఫొటోలతో కూడిన స్లైడ్‌లను ఏర్పాటు చేయాలని,ఈ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో @Indirammaindlu, @tghd.official, @telanganacmo ఖాతాలను ట్యాగ్ చేస్తూ #MaaIndirammaIntloDeepavali హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టు చేయాలని కోరారు.ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలని,ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి నూతన గృహాల్లో దీపాలు వెలిగించి ఈ వేడుకల్లో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రఘువీరా, ఈఈ పాషా. ప్రజలు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు

ఆరుపదుల వయసులోనూ అలుపెరుగని సైకిల్ ప్రయాణం





- **డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం.. భీమవరం నుంచి ఢిల్లీకి 3 వేల కిలోమీటర్ల యాత్ర**
- **విద్యార్థుల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న 62 ఏళ్ల ఇందూరి విజయలక్ష్మి**

ఆలేరు, నవంబర్ 7(సమయం న్యూస్)

వయసు కేవలం అంకె మాత్రమేనని నిరూపిస్తూ 62 ఏళ్ల వయసులోనూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఇందూరి విజయలక్ష్మి. డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణమే ధ్యేయంగా భీమవరం నుంచి దేశ రాజధాని ఢిల్లీ వరకు సుమారు 3 వేల కిలోమీటర్ల సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టారు. వృద్ధాప్యంలో విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో సమాజహితం కోసం ఆమె చేస్తున్న ఈ సాహసోపేత ప్రయాణం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ప్రస్తుత సమాజంలో యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలవుతున్న తీరు ఆందోళన కలిగిస్తోందని, ఈ మహమ్మారి నుంచి భావితరాలను కాపాడాలనే సంకల్పంతోనే ఈ యాత్ర చేపట్టినట్లు విజయలక్ష్మి పేర్కొంటున్నారు. సైకిల్ యాత్ర ద్వారా వివిధ ప్రాంతాల్లోని విద్యాసంస్థలను సందర్శిస్తూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలు, భవిష్యత్తుపై చూపే ప్రభావం గురించి విద్యార్థులకు వివరిస్తూ చైతన్య పరుస్తున్నారు. ఈ క్రమంలో శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చేరుకున్న విజయలక్ష్మికి యాదగిరిగుట్ట సీఐ శంకర్, ఎస్‌హెచ్‌ఓ ఉదయ్ కిరణ్‌తో పాటు పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఆమె చేపట్టిన యాత్ర లక్ష్యాన్ని అభినందిస్తూ ప్రోత్సాహం అందించారు. అనంతరం ఆలేరులోని ఎస్ఆర్, వీర్ కళాశాలలను సందర్శించిన విజయలక్ష్మి విద్యార్థినీ, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబాల్లో ఎదురయ్యే ఇబ్బందులు, వ్యక్తిగత జీవితంపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఆరుపదుల వయసులోనూ వేల కిలోమీటర్ల ప్రయాణానికి సిద్ధమై, సమాజానికి మేలు చేసే సందేశాన్ని చాటుతున్న విజయలక్ష్మి పట్టుదల, సేవాభావం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆమె చేపట్టిన ఈ యాత్ర విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

టపాసుల హోరు.. వినికిడికి జోరు ముప్పు!

సికింద్రాబాద్, నవంబర్ 07 :



దీపాల పండుగ దీపావళిని ఇతరులకు ఇబ్బంది కలగకుండా, శబ్ద కాలుష్యానికి దూరంగా జరుపుకోవాలని ప్రముఖ ఆడియాలజిస్ట్ డాక్టర్ గంగరాజు సూచించారు. ప్రస్తుత రోజుల్లో సంబరాల పేరుతో విపరీతమైన శబ్దం చేసే బాణాసంచా కాల్చడం ఎక్కువైందని, ఇది చెవుల వినికిడి శక్తిని శాశ్వతంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బాణాసంచా ఒక్కసారిగా పేలినప్పుడు వచ్చే తీవ్ర ధ్వనుల వల్ల చెవిలోని సున్నితమైన భాగాలు దెబ్బతిని, ఆకస్మిక వినికిడి లోపం (సడెన్ సెన్సోరినూరల్ హియరింగ్ లాస్) తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. అంతేకాకుండా చెవుల్లో నిరంతరం ఈలలు వేసినట్లు శబ్దాలు వినిపించే 'టిన్నిటస్' బారినపడే ముప్పు కూడా అధికంగా ఉందని తెలిపారు.మార్కెట్లో లభించే సుతిలి బాంబుల ద్వారా సుమారు 90 డెసిబుల్స్, లక్ష్మీ బాంబుల ద్వారా 94 నుంచి 103 డెసిబుల్స్, 200 వాలా వంటి లడీల ద్వారా ఏకంగా 115 నుంచి 120 డెసిబుల్స్ వరకు విపరీతమైన శబ్ద తీవ్రత వెలువడుతోందని ఆయన వివరించారు. సాధారణంగా 40 డెసిబుల్స్ వరకు శబ్దాలు సురక్షితమైనవే అయినప్పటికీ, 90 డెసిబుల్స్ దాటిన శబ్దాలను వినడం వల్ల తీవ్రమైన వినికిడి లోపం ఏర్పడే ప్రమాదముంది. ఈ తీవ్ర ధ్వనులు పిల్లలు, వృద్ధులు, గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారి ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. అలాగే బాణాసంచా పొగ వల్ల ఆస్తమా బాధితులకు శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయని, పక్షులు, జంతువులు తీవ్ర భయాందోళనలకు గురవుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అధిక శబ్దాలకు దూరంగా ఉంటూ, సురక్షితమైన రీతిలో వెలుగుల పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

కేజీబీవిని ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు

- **జిల్లా బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీసీఆర్.**

భువనగిరి నవంబర్ 07 (సమయం న్యూస్)



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల కళాశాలను (మైనారిటీ) రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యురాలు గోగుల సరిత శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికలకు పాఠశాలలో కల్పించిన సౌకర్యాలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.టీచర్ల హాజరు శాతం, వంటల నాణ్యతపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కమిటీ సభ్యులు కొడారి వెంకటేష్ గతంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ కు ఫిర్యాదు చేయడంతో కమీషన్ సభ్యురాలు సరిత పాఠశాలను సందర్శించినట్లు తెలుస్తోంది. విద్యార్థులు కమీషన్ సభ్యురాలికి లిఖిత పూర్వకంగా సమస్యలను వివరించినట్లు తెలిసింది. కార్యక్రమంలో పాఠశాల టీచర్ సువర్ణ,బి ఆర్ బి కో ఆర్డినేటర్ అనంతలక్ష్మి, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ దశరథ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన పోలీస్ అధికారులు

భువనగిరి నవంబర్ 07 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని క్యాంప్ కార్యాలయంలో పలువురు పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భువనగిరి డీఎస్పీ రవీందర్, బీబీనగర్ సీఐ సూర్యా నాయక్, భువనగిరి టౌన్ సీఐ వెంకటేశ్వర్లు, భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ అర్జునయ్య, రూరల్ ఎస్ఐ అనిల్ ఎమ్మెల్యే ని కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోకుండా కఠినంగా వ్యవహరించాలని, శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజలకు భద్రత, నమ్మకం కల్పించేలా పోలీసులు విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.



70 వ SGFI రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

- **వివేక విద్యా భారతి హై స్కూల్**

అమనగల్లు మున్సిపల్, నవంబర్,07(సమయం న్యూస్)

ఆమనగల్లు పట్టణంలోని స్థానిక Z.P.H.S (బాయ్స్) లో నిర్వహించిన వాలీబాల్ అండర్ 14 విభాగాల్లో ఆమనగల్లు పట్టణానికి చెందిన వివేక విద్యా భారతి హై స్కూల్ విద్యార్థులు, అండర్ 14 విభాగానికి అనుశ్రీ, జాహ్నవి, జిల్లాస్థాయి SGFI వాలీబాల్ క్రీడలకు ఎంపికైనారు. గత మూడు సంవత్సరాల నుండి వరుసగా జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడలకు ఎంపికై ప్రతిభ కనబరుస్తూ ఎన్నో పతకాలను సాధిస్తున్న వివేక విద్యా భారతి విద్యార్థులు. ఎంపికైన విద్యార్థులను మరియు పి ఈ టి శంకర్ లను పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమూద్, మరియు ఉపాధ్యాయ బృందము అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేష్, విజేందర్, కరుణాకర్, నజీర్, భరత్, రమేష్, అంజు మాస్టర్, అజ్ర, స్వప్న, రత్నకుమారి, దీప్తి, షమీం, అరుణ, విజయ, మీనా, లావణ్య, స్వాతి, కీర్తి, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు



ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ

కొడంగల్ నవంబర్,07(సమయం న్యూస్)



ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

కొడంగల్ నవీన ఆదర్శ ప్లే & హై స్కూల్, ఘనంగా దీపావళి సంబరాలు

- **సి.వి. రామన్ జయంతి వేడుకలు నిర్వహణ**

కొడంగల్

మున్సిపల్,నవంబర్,07(సమయం న్యూస్)

కొడంగల్‌లోని నవీన ఆదర్శ ప్లే & హై స్కూల్లో దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని దీపావళి పండుగ విశిష్టతను, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులకు సురక్షితమైన దీపావళి నిర్వహణపై అవగాహన కల్పించారు.అదే కార్యక్రమంలో ప్రముఖ భారతీయ భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ జయంతిని కూడా ఘనంగా నిర్వహించారు. ఆయన శాస్త్రీయ పరిశోధనలు, భారతదేశానికి అందించిన సేవలు, విజ్ఞాన రంగంలో సాధించిన ఘనతలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. డి.వి. నరేష్ రాజు,వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పండుగలతో పాటు మహనీయుల జీవితాలు, వారి సేవలను విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారి విజ్ఞానం మరియు సామాజిక బాధ్యత పెంపొందుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆనందంతో పాటు విజ్ఞానం, బాధ్యత, దేశభక్తి మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహనను పెంచే విధంగా విజయవంతంగా సాగింది.



ప్రతి ఇంటా ఆనంద దీపాలు వెలగాలి

- **వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**
- **వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు... ఎంపీ**

హనుమకొండ, నవంబరు 7 (సమయం న్యూస్)



దీపావళి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలతోపాటు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు ఎంపీ డాక్టర్ కడియం కావ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి దీపావళి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.దీపాల వెలుగులు ప్రతి ఇంటా ఆనందం, ఆప్యాయత, సిరిసంపదలను నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ పర్వదినం ప్రజల జీవితాల్లో నూతన ఆశలు, సరికొత్త వెలుగులు నింపాలని, అందరికీ ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని కోరుకున్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ మరింత ప్రగతిపథంలో పయనించాలని ఆకాంక్షించారు.పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, కాలుష్యాన్ని తగ్గించేలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చిన్నారులు బాణసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు, పెద్దలు అప్రమత్తంగా ఉండి తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు.వెలుగుల పండుగ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఉత్సాహాన్ని, సానుకూలతను నింపాలని, ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు.

రోడ్డు ప్రక్కన మృతి చెందిన జింక పిల్ల

చేవెళ్ల: నవంబర్ 07(సమయం న్యూస్)



చేవెళ్ళ మండలం అల్లాడ గ్రామ పరిధిలో చేవెళ్ల నుంచి షాద్ నగర్ వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన ఓ జింక పిల్ల మృతి చెందింది. మృతి చెందిన జింక పిల్లను కుక్కలు తింటున్న దృశ్యం స్థానికులను కలచివేసింది.వాహనం ఢీకొని జింక పిల్ల మృతి చెంది ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతం నుంచి తప్పిపోయి రోడ్డుపైకి వచ్చి ప్రమాదానికి గురై ఉండవచ్చని చెబుతున్నారు.ఈ విషయంపై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని స్థానికులు కోరుతున్నారు. జింకల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చూపు వెలుగులు నింపుతున్న జనతా ట్రస్ట్..

- **46 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు!**
- **ప్రతి గ్రామంలో జనతా ట్రస్ట్ సేవలు అందిస్తాం... డా.గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**

నర్సంపేట/ఖానాపురం, నవంబర్ 7 (సమయం న్యూస్)



నిరుపేదలకు ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా జనతా ట్రస్ట్ ముందుకు సాగుతోంది.ఖానాపురం మండలంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 46 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయించడం విశేషం. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఆపరేషన్లు చేయించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనైనా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి జనతా ట్రస్ట్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా 266 మందికి కంటి శస్త్రచికిత్సలు చేయించడంతో పాటు 1,400 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.ప్రతి గ్రామంలో జనతా ట్రస్ట్ సేవలు అందిస్తామని, సేవే లక్ష్యంగా ప్రజలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు.ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించుకున్న లబ్ధిదారులు డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డికి, జనతా ట్రస్ట్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, వైద్య బృందం, బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశంలో కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధికి నమూనాగా తీర్చిదిద్దుతాం

- **ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి**

దుద్యాల మండలం, నవంబర్,07(సమయం న్యూస్)



కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండలం హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ లో నవంబర్ 7 నుండి 9 వరకు నిర్వహించే రైతు మేళా సందర్భంగా మెగా రైతు మేళా , ఇండస్ట్రియల్ ఎక్స్ పోను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం మెగా రైతు మేళా మరియు పారిశ్రామిక ప్రదర్శనలో భాగంగా ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖిలో పాల్గొన్నారుఈ సందర్భంగ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...రైతుల భాదలు తెలిసిన వ్యక్తిగా కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఎల్ నినోను ఎదుర్కొనే విధంగా ప్రజలు అన్నివిధాలుగా సన్నద్ధం కావాలని ఆయన తెలిపారు. రైతులకు మేలు జరిగే విధంగా ఆధునిక పద్ధతులతో వ్యవసాయ సాగులో మెళుకువలను తెలుసుకోవాలన్నారు. రైతు సంక్షేమాన్ని కొడంగల్ ప్రాంతంలో పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆయన తెలిపారు. విద్యా , ఉపాధి అవకాశాలకు నోచుకోని వెనుకబడ్డ ప్రాంతమైన కొడంగల్ ప్రాంతంలో పరిశ్రమల తీసుకురావడమే కాకుండా ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులు నీటి ఆధారిత పంటలు కాకుండా ఉద్యాన పంటలు సాగు చేయాలని ఆయన సూచించారు. పంటల సాగులో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, వాటి ఆధారంగా పంటలు పండించాలని ఆయన తెలిపారు.మక్తల్ నారాయణపేట కొడంగల్ రిజర్వాయర్ నిమిత్తం భూ సేకరణ పనులను చేపట్టడం జరిగిందని, త్వరలోనే సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. తాండూర్ కందిపప్పు కు ప్రపంచవ్యాప్త గుర్తింపు వచ్చిందని, రైతులు అనుకుంటే ఏదైనా సాధించగలరని ప్రత్యామ్నాయ పంటలతో రైతులు అధిక రాబడి వచ్చే పంటలను సాగు చేయాలని ముఖ్యమంత్రి సూచించారుముందుగా రైతు మేళా సందర్భంగా వ్యవసాయ అనుబంధ శాఖలైన వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమలు, పశు సంపర్ధక , మత్స్య శాఖ ల ద్వారా ఏర్పాటు చేసిన స్టాళ్ల ను రాష్ట్ర ముఖ్య మంత్రి సందర్శించారు.రాష్ట్ర ముఖ్య మంత్రి తో పాటు శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి వాకాటి శ్రీహరి, మహబూబ్ నగర్ ఎంపీ మల్లు రవి, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి , వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేందర్ మోహన్, వికారాబాద్, నారాయణపేట జిల్లా కలెక్టర్లు దీపక్ తివారీ, జిల్లా ఎశాసన సభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లు రాజేశ్వర్ రెడ్డి, వికొడంగల్ మున్సిపల్ చైర్మన్ సందారం ప్రశాంత్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఐఎల్‌పీఏ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

- **నవంబరు 14న హనుమకొండలో 6వ రాష్ట్ర మహాసభ**
- **న్యాయవాదులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి...ఐఎల్‌పీఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిల్ల రాజేంద్ర ప్రసాద్**
- **నల్లకోట్లతో నీలి విప్లవం.. ఐఎల్‌పీఏ రాష్ట్ర సదస్సుకు పిలుపు**

హనుమకొండ, నవంబర్ 7 (సమయం న్యూస్)



ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) తెలంగాణ 6వ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, సదస్సు కన్వీనర్ చిల్ల రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. నవంబరు 14న హనుమకొండలోని డి కన్వెన్షన్‌లో నిర్వహించనున్న ఈ సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. శనివారం తొర్రూరు, మహబూబాబాద్, నర్సంపేట కోర్టుల్లో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ నాయకులు, ఐఎల్‌పీఏ ప్రతినిధులతో కలిసి గోడ పత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన 'పే బ్యాక్ టు సొసైటీ' పిలుపును లక్ష్యంగా చేసుకొని 'నల్లకోట్లతో నీలి విప్లవం' నినాదంతో ఐఎల్‌పీఏ పనిచేస్తోందని రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్ సిద్ధాంతాల పునాదిపై బహుజన, అణగారిన, పేద న్యాయవాదుల వృత్తి నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. బహుజన సమాజ చైతన్యానికి నిరంతరం పని చేస్తున్నామని చెప్పారు. సాంస్కృతిక విప్లవం విజయవంతం కానిదే బహుజన సమాజ విముక్తి సాధ్యం కాదన్నారు. భారత రాజ్యాంగం కేవలం న్యాయవాదులకు ఉపయోగపడే గ్రంథం మాత్రమే కాదని.. బడుగు, బలహీన వర్గాల జీవితాలను మార్చే స్ఫూర్తిదాయక వాహనమని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని గ్రామగ్రామానికి తీసుకెళ్లడమే ఐఎల్‌పీఏ లక్ష్యమని వివరించారు.బీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు చౌదరి వికాస్ పటేల్ అధ్యక్షతన జరిగే సదస్సుకు ముఖ్య అతిథిగా విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ కమిషన్ కమిషనర్ జస్టిస్ ఈద తిరుమలదేవి హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయమూర్తులు వి.బి. నిర్మలా గీతాంబ, ఎం.ఆర్. సునీత, పంచాయతీరాజ్ మంత్రి దనసరి అనసూయ సీతక్క, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొననున్నారు.సదస్సులో 79 ఏళ్ల స్వతంత్ర భారతంలో మహిళా స్వేచ్ఛ అంశంపై ప్రొఫెసర్ ఇ. సుధారాణి, ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపుపై ప్రొఫెసర్ గుగులోతు వీరన్న నాయక్, సామాజిక న్యాయంబహుజనుల ఐక్యతపై తెలుగు అకాడమీ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రజాస్వామ్యంలో న్యాయమూర్తుల నియామకంలోపాలపై ఐఎల్‌పీఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పొన్నం దేవరాజు గౌడ్ ప్రసంగించనున్నారు.ఐఎల్‌పీఏ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.జె. శాంసన్, కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, మెటుపల్లి రెండో తరగతి మెజిస్ట్రేట్ దయ రాజారాం, బహుజన ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షుడు దాసురాం నాయక్, రాష్ట్రీయ ముక్తి మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి ముఫ్తీ మహమ్మద్ ఫహీమొద్దీన్, ప్రొఫెసర్లు కూరపాటి రమేష్, వెంకయ్య, ఈసం నారాయణ, నిమ్మసు దర్శన్, ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ బూర విద్యాసాగర్, బ్యాంసెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డి. నరేందర్, నాయకులు ఎ. సంతోష్ కుమార్, ఐఎల్‌పీఏ నాయకులు తిప్పన డాంగే, తీగల జీవన్ గౌడ్, వి.ఎం. కృష్ణారెడ్డి, గజ్జల వెంకట్ రెడ్డి, అనంత ఆంజనేయులు, భానుప్రియ, చిల్ల రమేష్, టి. డేవిడ్, మహమ్మద్ ముధసిర్ అహ్మద్, వెంకటయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొననున్నారు. ప్రచార కార్యక్రమంలో ఐఎల్‌పీఏ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎగ్గడి సుందర్ రామ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు విలాసాగరం సురేందర్ గౌడ్, తొర్రూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. వెంకటరత్నం, ఉపాధ్యక్షుడు నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి టి. సైదులు, మహబూబాబాద్ బార్ అధ్యక్షుడు మామిడాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జంగం సిద్ధార్థ, ఐఎల్‌పీఏ తొర్రూరు బార్ అధ్యక్షుడు వలపు మధుసూదన్, కలవకొలను ప్రవీణ్ రాజు పాల్గొన్నారు.తొర్రూరు న్యాయవాదులు అరేళ్లి శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

పోలీస్ క్రీడల్లో మల్కాజిగిరి జట్ల హవా.. పతకాల పంట!

- **విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిళ్లను సమర్థంగా ఎదుర్కోవడానికి క్రీడాస్ఫూర్తి దోహదపడుతుంది**
- **కబడ్డీలో స్వర్ణం.. ఇతర విభాగాల్లో రజత, కాంస్య పతకాలు.. విజేతలకు సీపీ బి. సుమతి అభినందనలు**
- **మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి**

మల్కాజిగిరి, సమయం



విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిళ్లను సమర్థంగా ఎదుర్కోవడానికి క్రీడాస్ఫూర్తి దోహదపడుతుందని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి అన్నారు. రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ క్రీడాకారులు విజయకేతనం ఎగురవేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన 5వ తెలంగాణ వార్షిక పోలీస్ క్రీడలు, ఆటల పోటీలు (క్లస్టర్‌డి) లో పలు విభాగాల్లో పతకాలు సాధించి సత్తా చాటారు క్రీడలు పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని సీపీ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిళ్లను సమర్థంగా ఎదుర్కోవడానికి క్రీడాస్ఫూర్తి దోహదపడుతుందని తెలిపారు. గెలుపోటముల కంటే నిజాయితీగా పోటీపడటం, ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుంటూ మరింత మెరుగ్గా రాణించాలనే సంకల్పమే నిజమైన క్రీడాస్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ విజయాలపై మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి విజేతలను అభినందించారు. క్రీడాకారుల అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల, జట్టు స్ఫూర్తిని ప్రశంసించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. క్లస్టర్‌డి పోటీల్లో సాధించిన విజయాలు కమిషనరేట్‌కు గర్వకారణమని, ఇతర పోలీసు సిబ్బందికి కూడా క్రీడల్లో పాల్గొనేందుకు ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. పోటీల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన నిర్వాహకులు, కోచ్‌లు, జట్టు మేనేజర్లు, సహకరించిన సిబ్బందిని కూడా అభినందించారు. ఈ పోటీలకు నోడల్ అధికారిగా అంబర్‌పేట కార్ హెడ్‌క్వార్టర్స్ ఏసీపీ పి. శైలేష్ కుమార్, జట్టు కెప్టెన్‌గా ఆర్ఎస్ఐ జి. గోవింద్ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ (పరిపాలన) పి. ఇందిరా, అంబర్‌పేట కార్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ కె. శ్యామ్ సుందర్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, విజేత క్రీడాకారులు పాల్గొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే ఉత్సాహం, క్రమశిక్షణతో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విజేతలకు పోలీస్ కమిషనరేట్ శుభాకాంక్షలు తెలిపింది మహిళల కబడ్డీ జట్టు - 12 బంగారు పతకాలు, పురుషుల కబడ్డీ జట్టు - 12 వెండి పతకాలు, పురుషుల ఖోఖో జట్టు - 12 కాంస్య పతకాలు, పురుషుల ఫుట్‌బాల్ జట్టు - 16 కాంస్య పతకాలు, పురుషుల హ్యాండ్‌బాల్ జట్టు - 12 కాంస్య పతకాలు.

పేద కుటుంబాలకు ఉచిత రేషన్ కిట్లు పంపిణీ

- **చర్లపల్లిలో సేవా కార్యక్రమం.. పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

చర్లపల్లి,సమయం



నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందించడం సంతోషకరమని, ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు.శనివారం పేద కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యంగా ముకుల్ మాధవ్ ఫౌండేషన్ (ఎంఎంఎఫ్), ఫినోలెక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో చర్లపల్లిలో భారీ ఉచిత రేషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులతో కూడిన రేషన్ కిట్లను పంపిణీ చేశారు. .. ఫినోలెక్స్ ఇండస్ట్రీస్, ముకుల్ మాధవ్ ఫౌండేషన్ సమాజం పట్ల బాధ్యతతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయమన్నారు. నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందించడం సంతోషకరమని, ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఒక్కో రేషన్ కిట్ విలువ రూ.1,500 కాగా, దీపావళి పండుగ వేళ పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లోని 22 ప్రాంతాల్లో మొత్తం 11,295 రేషన్ కిట్లను పంపిణీ చేస్తూ లక్ష మందికి పైగా పేదలకు ప్రయోజనం చేకూర్చేలా సంస్థలు చేపట్టిన సేవా కార్యక్రమాన్ని ప్రశంసించారు. ముకుల్ మాధవ్ ఫౌండేషన్ 1999 నుంచి ఆరోగ్యం, విద్య తదితర రంగాల్లో సేవలందిస్తూ పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోంది. పూణేలోని కేఈఎం ఆసుపత్రిలో పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఏర్పాటు, పేద విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్కాలర్‌షిప్‌లు, టీబీ ముక్త్ భారత్ అభియాన్‌కు మద్దతుగా పోషకాహార కిట్ల పంపిణీ వంటి కార్యక్రమాలను చేపడుతోంది. చర్లపల్లిలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఫినోలెక్స్ ఇండస్ట్రీస్ పూణే, హైదరాబాద్ బృందాల సభ్యులు, స్థానిక డిస్ట్రిబ్యూటర్ నల్లపాటి బసంత్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్ శ్రీనివాస్ రెడ్డి, చర్లపల్లి బీఆర్ఎస్ నాయకులు మహేష్, నాగారం బాబు, జీఎం జీఎల్‌వీ బాబు, చర్లపల్లి అసోసియేషన్ మాజీ చైర్మన్ రోషిరెడ్డి, దస్తగిరి రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

చిన్నారుల మధ్య దీపావళి వెలుగులు

- **మల్లికాంబ మనోవికాస కేంద్రం పిల్లలతో దీపావళి వేడుకలలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

హనుమకొండ, నవంబరు 7 (సమయం న్యూస్)



మానసిక దివ్యాంగ చిన్నారులతో దీపావళి వేడుకలు జరుపుకొని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆనందాన్ని పంచుకున్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని హనుమకొండ మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన చిన్నారులు శనివారం కనకదుర్గ కాలనీలోని కడియం కావ్య, కడియం శ్రీహరి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా చిన్నారులను ఎంపీ, ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించారు.స్వయంగా స్వీట్లు తినిపించి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులతో ఆనందంగా గడుపుతూ పండుగ సంతోషాలను పంచుకున్నారు. వారి ఆత్మీయ పలకరింపుతో చిన్నారుల్లో ఆనందం వెల్లివిరిసింది.